www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -352 సోమవారం 30 మార్చి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమా...?

**హైదరాబాద్,మార్చి 29 ప్రజావినికిడి,** మాజీ మంత్రి హరీష్ రావు రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. నా బావమరిది, నా తమ్ముడిపై రేవంత్ ఆరోపణలు చేశారు. మీ తమ్ముడు చేసిన అవినీతి, నీ బావమరిది అమృత్ టెండర్లు, సింగరేణిలో అవినీతిపై కమిటీ వేసేందుకు నీవు సిద్ధమైతే, నేను సిద్ధమే అని హరీష్ రావు స్పష్టం చేశారు.హౌస్ కమిటీ వద్దు, సీబీసీఐడీ వద్దు, సిట్టింగ్ జడ్జితో విచారణకు రావడానికి దమ్ముందా అని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి అంశం నుంచి డైవర్షన్ కోసం మా మీద బురద జల్లుతున్నారు.

## యుద్ధం సవాళ్ల వేళ ... తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు : ప్రధాని మోడి



**న్యూఢిల్లీ,మార్చి 29 ప్రజావినికిడి,** పశ్చిమాసియాలో గత నెల రోజులుగా కొనసాగుతోన్న యుద్ధం ... ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లను సృష్టించిందని ప్రధాని నరేంద్ర మోడి అన్నారు. 132వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. మోడి మాట్లాడుతూ ... ఈ మార్చి నెలలో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో కీలక ఘటనలు జరిగాయని అన్నారు. గతంలో కోవిడ్ కారణంగా ప్రపంచమంతా అనేక సమస్యలు ఎదుర్కొందని, దాని నుంచి బయటపడిన తర్వాత..

# ఏ తల్లిదండ్రులు అనాధలుగా మిగిలిపోకూడదు

● పోషణ, పర్యవేక్షణ బిల్లు వారికి రక్షణ కవచం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

● బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనసభ



**హైదరాబాద్,మార్చి 29 ప్రజావినికిడి,**రాష్ట్రంలో ఏ తల్లిదండ్రులు అనాధలుగా మిగిలి పోకూడదని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. "తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబుదారి తనం, పర్యవేక్షణ బిల్లు-2026" కు రాష్ట్ర శాసనసభ ఆదివారం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పిల్లల కోసం తల్లిదండ్రులు తమ శక్తినంతా ధారపోస్తారనీ, పిల్లలు మాత్రం రెక్కలొచ్చాక తల్లిదండ్రుల్ని పట్టించుకోవడం లేదని అన్నారు. జీవితపు చరమాంకంలో వృద్ధ తల్లిదండ్రులకు రక్షణ కవచంగా నిలవాలనే ఈ చట్టం తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. "మనిషులు బంధాలు... అనుబంధాలను మర్చిపోయి చివరికి పేగు బంధాలను కూడా విస్మరించారు. భౌతిక సుఖాలు, ఆర్థిక ప్రయోజనాలు, సంపద కోసం పాకులాటల్లో మునిగిపోయారు. సమాజం తలదించుకునేలా కొందరు పిల్లలు వ్యవహరిస్తున్నారు. ఆత్మీయతకు సంబంధించిన అంశంపై చట్టం తీసుకురావడం బాధాకరం.తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడని వ్యక్తిని సొసైటీ మిగతా2లో...



## కూటమి స్ఫూర్తిని మరింత బలోపేతం చేద్దాం

### : టీడీపీ శ్రేణులకు పవన్ కల్యాణ్

**అమరావతి,మార్చి 29 ప్రజావినికిడి,**

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆ పార్టీకి, నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో మిగతా2లో...

## పలు పద్దులకు అసెంబ్లీ ఆమోదం




**హైదరాబాద్,మార్చి 29 ప్రజావినికిడి,** పలు పద్దులకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఆదివారం శాసనసభలో విద్య, వైద్యం, రోడ్లు, భవనాలు, కార్మిక, ఉపాధి, అటవీ, పర్యావరణం, నీటిపారుదల, పౌరసరఫరాలశాఖల పద్దులపై శాసనసభ చర్చించింది. పద్దులపై జరిగిన చర్చకు విద్య, వైద్యానికి సంబంధించి వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు, భవనాలశాఖకు సంబంధించి శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కార్మికశాఖ మంత్రి వివేక్, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ సమాధానమిచ్చారు. అనంతరం స్పీకర్ సభను సోమవారం ఉదయం

# భవిష్యత్ టిడిపిదే

- కార్యకర్తలకు న్యాయబద్ధ సంపాదన - ప్రతి ఎన్నికల్లోనూ మనమే గెలవాలి

- పార్టీ ఆవిర్భావ సభలో అధినేత చంద్రబాబు నాయుడు







**అమరావతి,మార్చి 29 ప్రజావినికిడి,**

గతం, వర్తమానం, భవిష్యత్ టిడిపిదే అని ఆ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పార్టీ పుట్టుక నుంచి నేటి వరకు సిద్ధాంతాలు, విజయాలు, ప్రయాణం, అన్నీ సంచలనమే అని చెప్పారు. టిడిపి 44వ ఆవిర్భావ సభ ఆ పార్టీ కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కార్యాలయం ముందు ఉన్న పార్టీ జెండాను సిఎం ఎగురవేశారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడారు. విజయాలతో పాటు సంక్షోభాలు, సవాళ్లను కూడా టిడిపి చూసిందన్నారు. ఎంతోమంది కార్యకర్తలు త్యాగాలు చేశారని, ప్రాణాలు పోగొట్టుకున్నారని వివరించారు. గత ప్రభుత్వ విధ్వంసంపై లోకేష్ చేసిన యువగళం పాదయాత్రను అడ్డుకుంటే కార్యకర్తల అండతో అడుగు ముందుకేశాడని చెప్పారు. 2019-24 మధ్య కాలంలో తనను కూడా జైల్లో పెట్టారని మిగతా2లో...

# ఇక భూతల పోరు?

దళాలను మోహరిస్తున్న అమెరికా

చర్చలంటూనే ఇదేం పని ? : నిలదీసిన టెహ్రాన్


ఇరాన్ దాడిలో కీలక నిఘా విమానాన్ని కోల్పోయిన అగ్రరాజ్యం




**వాషింగ్టన్,మార్చి 29 ప్రజావినికిడి,**

ఇరాన్‌పై భీకర భూతల దాడులకు అమెరికా రం గం సిద్ధం చేసుకొంటోంది. ఇందులో భాగంగా ఆదివారం అమెరికాకు చెందిన అత్యంత శక్తివంతమైన యుద్ధనౌక యుఎస్ఎస్ ట్రిపోలీ పశ్చిమాసియాకు చేరింది. అయితే ఇది ఏ ప్రాంతంలో ఉందనేది వెల్లడికాలేదు. ఈ యుద్ధ నౌకలో 2,500 మంది వరకూ మెరైన్ సైనికులు ఉన్నారు. ఇ ప్పటికే ఇక్కడున్న సైన్యంతో కలిపితే ఇప్పుడు ఇక్కడ అమెరికా నావికాదళం బలం 3,500కు చేరుకుంది. ఇక్కడికి అమెరికా మెరైన్స్ చేరుకున్న విషయాన్ని యుఎస్ సెంట్రల్ కమాండ్ ఎక్స్ సోషల్ మీడియా ద్వారా ప్ర కటించింది. ఇక్కడికి చేరిన ట్రిపోలీ అధునాతన ఉభయచర దాడుల సామర్థ్య మిగతా2లో...

## ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీ




2లో

# భవిష్యత్ టిడిపిదే...

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఇన్నేళ్ల ప్రస్థానం, నేటి ఈ అధికారం అంతా కార్యకర్తల త్యాగాలు, కష్టం వల్లే వచ్చిందని చెప్పారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం ఒత్తిడితో రాష్ట్రంలోని ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేస్తే ప్రజలే రోడ్డెక్కి ఉద్యమించారని, ఇదొక రికార్డు అని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమానికి నాంది పలికింది టిడిపి ప్రభుత్వాలే అని వెల్లడించారు. మహిళలకు నాడు స్థానిక ఎన్నికల్లో కల్పించిన రిజర్వేషన్ దశాబ్దాల తర్వాత 33 శాతం రిజర్వేషన్‌కు అడుగులు పడడానికి కారణమయ్యిందని చెప్పారు. ఈసారి 50 శాతం సీట్లు పెరుగుతున్నాయని, 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు అమలు కాబోతున్నాయని చెప్పారు. పార్టీ కోసం పనిచేసే వాళ్లకే పదవులు ఇస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వాళ్లకు ప్రజాప్రతినిధులుగా అవకాశం ఇస్తామని పునరుద్ఘాటించారు. కార్యకర్తల వల్లే ఇక్కడ ఉన్నామని విషయాన్ని ఎమ్మెల్యేలు, మంత్రులు బాగా అర్థం చేసుకోవాలని తెలిపారు. కార్యకర్తలను పట్టించుకోని వాళ్లు, ఇబ్బంది పెట్టే నాయకులు తమకు అవసరం లేదన్నారు. కష్టపడే కార్యకర్తలు, నేతలను గుర్తించే బాధ్యత లోకేష్‌దే అని తెలిపారు. ప్రజలతో మమేకం కావాలని, సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. కార్యకర్తలకు ఆర్థిక సాధికారత కల్పిస్తామని, న్యాయబద్ధమైన సంపాదన వచ్చేలా సహకరిస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు. సామాజిక పెన్షన్లు, తల్లికి వందనం, స్త్రీ శక్తి, మత్స్యకారుల సేవలో, అన్నదాత సుఖీభవ, డిఎస్‌సి భర్తీ వంటి వాటిని అమలు చేశామన్నారు. ఈ ఏడాది కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని, భవిష్యత్‌లోనూ పెంచబోమన్నారు. అమరావతిలో మొదటి ప్రారంభించిన పనులు 2028 ఆగస్టుకు పూర్తిచేసి ప్రధాన మంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ఫ్యూచర్ సిటీగా అమరావతిని నిర్మిస్తున్నామని, ఇక మూడు ముక్కలాట లేదన్నారు. ఒకే రాష్ట్రం ఒకే రాజధాని, అదే అమరావతి అని వివరించారు. భవిష్యత్‌లో పోలవరాన్ని కూడా పూర్తిచేస్తామన్నారు. టిడిపి అభివృద్ధి రాజకీయాలు చేస్తోందని, వైసిపి చేసే తప్పుడు ప్రచారాలను పార్టీ తిప్పికొట్టాలని చెప్పారు. నిత్యం ప్రజల్లో ఉండాలని, చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరికీ వివరించాలని తెలిపారు. వచ్చే అన్ని ఎన్నికల్లోనూ ఎన్‌డిఎ గెలవాలని చెప్పారు. అన్ని పదవుల్లోనూ జనాభా దామాషా పద్ధతిన అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చంద్రబాబుతో అండమాన్ నికోబార్ టిడిపి అధ్యక్షులు మాణిక్య యాదవ్, తెలంగాణ నాయకుడు నర్సింహులు మాట్లాడారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సారి వేదికపై యువ నేతలకు పెద్దపీట వేశారు. వేదికపై కార్యకర్తలను, సభికుల్లో సీనియర్ నేతలను కూర్చొబెట్టారు. అనంతరం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో 60 నియోజకవర్గాలకు చెందిన సీనియర్ కార్యకర్తలతో కలిసి చంద్రబాబు, లోకేష్ భోజనం చేశారు.

## పుష్కరాల నిర్వహణకు టెక్నికల్ ఇంజనీర్ల కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటించి 15 లేదా 20 రోజుల్లోగా నివేదికను అధికారుల కమిటీకి అందజేయాలన్నారు. ఇంజనీర్ల కమిటీ నివేదికను అధికారుల కమిటీ పరిశీలించి, పూర్తి అంచనాలతో నివేదికను క్యాబినెట్ సబ్ కమిటీకి పంపాలని తెలిపారు. క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం తరువాత ప్రణాళికలకు సంబంధించిన నివేదికపై క్యాబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. శాశ్వత, తాత్కాలిక పనులను ప్రాధాన్యతల వారీగా పూర్తి చేసేలా ప్రణాళికలు ఉండాలని నిర్దేశించారు. వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం తలెత్తకుండా ప్రజా భవన్‌లో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ప్రధాన దేవాలయాలు, పర్యాటక ప్రదేశాల్లో ఘాట్ల విస్తరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, వివిధ ప్రాంతాల మధ్య కనెక్టివిటీ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం అభివృద్ధి, ఆలయ విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై వారికి సీఎం పలు సూచనలు చేశారు.

## ఏ తల్లిదండ్రులు అనాథలుగా మిగిలిపోకూడదు

(మొదటి పేజీ తరువాయి)

బహిష్కరించాలి. కన్నవారిని చూసుకోలేనివాడు సమాజంలో బతకడానికి వీల్లేదు. తల్లిదండ్రుల పట్ల భక్తి లేని వారికి భయం కలిగించేందుకే ఈ చట్టాన్ని ఎంతో బాధ్యతతో, భావోద్వేగంతో ఆలోచన చేసి తీసుకువస్తున్నాం" అని సీఎం అన్నారు. చూపు లేని తల్లి దండ్రుల చివరి కోరిక అయిన పుణ్యక్షేత్ర దర్శనానికి కావిడిలో కూర్చోబెట్టుకుని తన భుజాలపై తీసుకెళ్లిన శ్రవణ కుమారుడు నేటి సమాజానికి ఆదర్శమన్నారు. రేమండ్స్ కంపెనీ చైర్మెన్, పద్మభూషణ్ అవార్డు గ్రహిత విజరు పథ్ సింఘానియా తాను సంపాదించిన రూ.1,000 కోట్ల ఆస్తిని కొడుకుకు ధారపోసి, అతను చేసిన ద్రోహంతో అనామికుడిగా తనువు చాలించారని ఆవేదన వ్యక్తం చేశారు. "పిల్లలకు సర్వస్వం ఇచ్చి తప్పు చేశాను. నేను చేసిన తప్పు ఏ తల్లిదండ్రులు చేయకూడదని ఆయన తన ఆత్మకథ "ఇన్ కంప్లీట్ లైఫ్"లో చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. శ్రవణ కుమారుడి గాథ అజరామరమైతే... వేల కోట్లు సంపాదించినా కన్న వారి ఆదరణలేక అనామకుడిగా కన్నుమూసిన విజయ్ పథ్ సింఘానియా ఉదంతం ఆధునిక సమాజపు చీకటి కోణాన్ని ఆవిష్కరించింది" అని సీఎం అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకే కాదు.. ప్రజా ప్రతినిధులను కూడా ఈ చట్టం పరిధిలోకి తెచ్చామని పేర్కొన్నారు. కొడుకులతో పాటు ఉద్యోగం చేసే కూతుళ్లకు కూడా ఈ చట్టం వర్తిసుందన్నారు. కుటుంబం అంటే కొడుకైనా, కూతురైనా ఇద్దరూ సమానమేనన్నారు. ఆడబిడ్డలకు తల్లిదండ్రులపై ప్రేమ ఉన్నా... మెట్టినింటి బాధ్యతలతో ఏమీ చేయలేకపోతున్నారనే దృష్టితోనే చట్టాన్ని రూపొందించామని వివరించారు. ఈ చట్టంతో వృద్ధ తల్లిదండ్రులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించేందుకు బలమైన ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. చట్టం తమ ఇంటి మెట్టెక్కకుండానే కన్న వారిని పిల్లలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. వృద్ధుల పోషణ, పర్యవేక్షణ బిల్లు సామాజిక పరివర్తన క్రమంలో మైలురాయని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్ అన్నారు. ఈ బిల్లును సభ్యులందరూ ఎకగ్రీవంగా ఆమోదించాలని కోరారు. అనంతరం బిల్లుకు బీజేపీ, ఎంఐఎం, సీపీఐ సభ్యులు మద్దతు తెలపడంతో సభ ఏక గ్రీవంగా ఆమోదించింది.

**పరిహారం పెంచడం సాధ్యం కాదు**

వృద్ధుల పోషణ, పర్యవేక్షణ బిల్లుపై చర్చ సందర్భంగా సభ్యులు కూనంనేని సాంబశివరావు, పాయల్ శంకర్, జాఫర్ హుస్సేన్, ఆదినారాయణ చేసిన సవరణలు, ప్రతిపాదనలపై ఈ సందర్భంగా సీఎం వివరణ ఇచ్చారు. వద్ధుల కోసం కేంద్రం 2007లో ఒక చట్టం తెచ్చిందనీ, ఆ చట్టం ప్రకారం తల్లిదండ్రులకు రూ.10 వేలకు మించి ఇచ్చే అవకాశం లేదన్నారు. కేంద్రం చేసిన చట్టానికి భిన్నంగా వ్యవహరిస్తే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన ఈ కొత్త చట్టం ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని వ్యాఖ్యానించారు. అయితే మన అభిప్రాయాలను, ఆలోచనలను సభ ద్వారా కేంద్రానికి విన్నవిద్దామని సీఎం పేర్కొన్నారు.

## పలు పద్దులకు అసెంబ్లీ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

10 గంటలకు వాయిదా వేశారు. అంతకు ముందు జరిగిన చర్చలో ఎంఐఎం శాసనసభ్యులు మహ్మద్ పాషాఖాద్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి, బీజేపీ సభ్యులు కాటెపల్లి వెంకట రమణారెడ్డి, కాంగ్రెస్ సభ్యురాలు డాక్టర్ రాగమయి, కాంగ్రెస్ సభ్యులు బి.మనోహర్ రెడ్డి, బీజేపీ సభ్యులు మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ సభ్యులు ఆది శ్రీనివాస్, సీపీఐ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ మంత్రులు మంజూరు నిస్తున్నా క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదని విమర్శి ంచారు. మంత్రుల మధ్య సమన్వయం అవసరమని సూచించారు. విద్యకు బడ్జెట్ పెంచాలని కోరారు. యూనివర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేయకుండా ఉన్నత విద్య బలోపేతం కాదని తెలిపారు. రోడ్డెక్కుతున్న కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీఈవోలుగా ఇతర శాఖల వారిని నియమించొద్దని సూచించారు. అసంఘటితరంగ కార్మికుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏజెన్సీల దోపిడీ నుంచి కాపాడాలన్నారు. సింగరేణిలో కనీస వేతనాల సమస్యను పరిష్కరించాలనీ, ఆర్టీసీలో యూనియన్లను పెట్టుకునేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రి వివేక్ సమాధానమిస్తూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్లపై రాష్ట్ర ప్రభుత్వం చర్చిస్తుంది. ఆ తర్వాత నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు సూచన బాగుందనీ, అసంఘటితరంగ కార్మికులకు లబ్ది జరిగేలా ఆలోచిస్తామని మాటిచ్చారు. గిగ్ వర్కర్ల సంక్షేమానికి సంబంధించిన బిల్లును శాసనసభలో సోమవారం ప్రవేశపెట్టనున్నట్టు వెల్లడించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణ వాటాను కాపాడుకుంటూ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య, ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేసేందుకు తీసుకున్న, తీసుకుంటున్న చర్యలను వివరించారు. వైద్యారోగ్యశాఖలో సిబ్బంది కొరత లేకుండా నియామకాలు చేపడుతున్నట్టు తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గత 10 ఏండ్లలో నిర్లక్ష్యం చేసిన అటవీ, దేవాదాయశాఖలను గాడిలో పెడుతున్నామని చెప్పారు.



## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి అరుదైన గుర్తింపు

**మార్చి 29 ప్రజావినికిడి,**
కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు మరో అరుదైన ఘనత సాధించారు. దేశంలో పవర్‌ఫుల్ ఇండియన్స్ (శక్తిమంతమైన భారతీయులు) జాబితాలో ఆయన చోటు సంపాదించారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకటించిన వంద మంది శక్తివంతమైన భారతీయుల జాబితాలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు 90వ స్థానాన్ని పొందారు. మోదీ ప్రస్తుత కేబినెట్‌లో అత్యంత పిన్న వయస్కుడు అయిన కేంద్ర మంత్రిగా రామ్మోహన్ నాయుడు గుర్తింపు పొందారు. గతేడాది 2025 అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా (AI 171) విమాన ప్రమాదం.. అలాగే ఇండిగో విమానయాన సంక్షోభాలను పౌర విమానయాన శాఖ మంత్రిగా ఆయన సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అదే విధంగా దేశీయ ఏరోస్పేస్ తయారీ రంగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, విమాన ప్రయాణాన్ని సామాన్యులకు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఆయన కృషి చేస్తున్నారు. లోక్‌సభ సభ్యుడిగానే కాకుండా కేంద్ర మంత్రిగా పార్లమెంటులో బలమైన ప్రాంతీయ గళాన్ని ఆయన తనదైన శైలిలో వినిపిస్తున్నారు. అలాగే పలు సామాజిక అంశాలపై నిరంతరంగా ఆయన పోరాటం చేస్తున్నారు. రాజకీయాల్లోకి రాక ముందు రామ్మోహన్ నాయుడు మంచి ఫొటోగ్రాఫర్ కూడా. నరేంద్ర మోదీ క్యాబినెట్‌లో 38 ఏళ్ల అత్యంత పిన్న వయస్కుడైన కేంద్ర మంత్రుల్లో ఒకరిగా రామ్మోహన్ నాయుడు గుర్తింపు పొందారు.

## గుజరాత్‌లో దళితులపై కక్ష: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,మార్చి 29 ప్రజావినికిడి,** గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వ హయాంలో దళితుల అణచివేత ఎక్కువ అయిందని కాంగ్రెస్ నేత, ఎంపి రాహుల్ గాంధీ విమర్శించారు. బిజెపి సంకుచితవాదంతో విద్వేషకర వాతావరణం నెలకొంది. దళితులు, ఆదివాసీ వర్గాలపై దాడులు , వారిపట్ల వివక్ష పెరుగుతోందని అన్నారు. గుజరాత్‌కు చెందిన దళితులు, ఆదివాసీలతో తాను ఇటీవల మాట్లాడినప్పుడు, వారి సాధకబా ధకాలు తెలిసివచ్చాయని ఆయన సోషల్ మీడియా ద్వారా స్పందించారు. వారి సాధకబాధకాలను తెలియచేయాల్సిన కనీస బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. 2016 ఉన్నా దారుణ ఉదంతం బాధితుల పట్ల తాము పూర్తిగా సంఘీభావం వ్యక్తం చేస్తున్నామని, వారికి పూర్తి స్థాయి న్యాయం జరిగే వరకూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. తనను కలిసిన బాధితులలో ఉన్న దళితులు కూడా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. గుజరాత్ దళితులతో తాను మాట్లాడినప్పుడు వారి కష్టాలు నష్టాల గురించి ఎంతో అవగావహన కల్గింది. ఆందోళన కల్గించాయని రాహుల్ తెలిపారు. వారికి న్యాయం కోసం మరింతగా స్పందించాల్సిన అవసరం ఉందనే అంశాన్ని గుర్తించానని పేర్కొన్నారు.

## ఇక భూతల పోరు?

(మొదటి పేజీ తరువాయి)

యుద్ధనౌకగా పేరొందింది. అంతకు ముందు చైనాకు సవాలు విసురుతూ కొంతకాలం జపాన్ తీరంలో మోహరించుకుని ఉంది. అతి కొద్దిరోజుల్లోనే పశ్చిమాసియాకు అత్యంత సుశిక్షితులైన పదివేల మంది వివిధ స్థాయిల సైనికులను పంపిస్తుందని ట్రంప్ ఇటీవల తెలిపారు. చర్చల్లో పురోగతి ఉందని చెపుతూనే ఇరాన్‌పై ఇకపై దాడి తీవ్రస్థాయిలో ఉంటుందని హెచ్చరిస్తూ వస్తున్నారు. గత 20 సంవత్సరాలలో ఎప్పుడూ లేని విధంగా అమెరికా సేనలు ఇప్పుడు అత్యధిక సంఖ్యలో పశ్చిమాసియాకు చేరాయి. ఇంతవరకూ వైమానిక,క్షిపణుల దాడులలో ఇరాన్ సైన్యం ఎప్పటికప్పుడు శక్తివంతంగా ఉండటం, మరో వైపు అమెరికా సైనిక స్థావరాల ఉన్నాయనే కారణంతో అత్యంత కీలకమైన గల్ఫ్ దేశాలను దెబ్బతీస్తూ ఉండటంతో వెంటనే తీవ్ర కార్యాచరణలో భాగంగా ట్రంప్ ఆదేశాలతోనే భూతలపోరుకు అమెరికా సేనలు సిద్ధం అయినట్లు వెల్లడైంది. ఈ క్రమంలో ఇప్పుడున్న బలగాలతోనే ఇరాన్ లోని అత్యంత కీలకమైన వ్యూహాత్మక ప్రాంతాల్లోకి ఇరాన్ సైనికులు చేరుకుని దాడులకు ,స్వాధీనప్రక్రియకు దిగుతారని వెల్లడైంది. అయితే తక్షణ రీతిలో భూతల దాడులకు అమెరికా దిగుతుందా? లేక మరింత అదును కోసం వేచి చూస్తుందా? అనే విషయంపై స్పష్టత రాలేదు.అమెరికా సేనలొస్తే తగులబెట్టేస్తాం శవపేటికలే భూతల దాడుల హెచ్చరికలపై ఇరాన్ స్పీకర్ స్పందన అమెరికా భూతల దాడులకు సిద్ధం అవుతుందనే వార్తలపై ఇరాన్ స్పీకర్ మెహమ్మద్ బఘేర్ ఖాలిబాఫ్ తీవ్రంగా స్పందించారు. అమెరిక సేనలు ఇరాన్ నేలపైకి వచ్చే ఘడియల కోసం చూస్తున్నాం. వారు చేరుకోగానే మా మంటల్లో వారు మాడిపోవల్సిందే. వారినే కాకుండా వారి ప్రాంతీయ స్థాయి వాటాదార్లను కూడా తగు విధంగా శిక్షిస్తామని ఆయన ఘాటైన పదజాలంతో మండిపడ్డారు. అమెరికాకు ధైర్యముంటే ఇరాన్‌పై పదాతిదళ దాడులకు దిగమనండి చూద్దాం అని సవాలు విసిరారు. వారు ఇక్కడికి వస్తే తమ ప్రతీకారం ఎంతతీవ్రంగా ఉంటుందనేది వారికే కాకుండా వారి మిత్ర దేశాల వారికి కూడా తెలిసివస్తుందన్నారు. ఇక అమెరికా నుంచి వెలువడుతున్న చర్చల ప్రతిపాదన గురించి మాట్లాడుతూ వారి షరతులకు తలొగ్గేది లేదన్నారు. అమెరికా నుంచి 15 అంశాల ఫార్ములా అందింది.

## ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీ

**అమరావతి మార్చి 29 ప్రజావినికిడి,** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను , బదిలీ చేసింది. ఏపీఈడీబీ సీఈవోగా సగిలి షణ్మోహన్‌ను నియమించింది. ఏపీఐఐసీ ఎండీగా ఎఎస్ దినేష్‌కుమార్ , గుంటూరు జిల్లా కలెక్టర్‌గా సాయికాంత్ వర్మను ,విశాఖ జిల్లా కలెక్టర్‌గా అభిషిక్త్ కిషోర్‌ను నియమించింది. కాకినాడ జిల్లా కలెక్టర్‌గా ఎంఎన్ హరేందిర ప్రసాద్, అల్లూరి జిల్లా కలెక్టర్‌గా టి.నిశాంతిని, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా తమీమ్ అన్సారియాను కూటమి ప్రభుత్వం నియమించింది .

## సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమా...?

(మొదటి పేజీ తరువాయి)

మీరు ఎటువంటి తప్పు చేయకుంటే, విచారణకు రావాలని సవాల్ విసిరారు.మీ నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయల టెండర్లు పొంగులేటికే ఇచ్చావు. అలాగే, నీ కలల ప్రాజెక్ట్ మూసీ పునరుద్ధరణ మంత్రి పొంగులేటికి ఇచ్చారు. అందుకే పొంగులేటిని కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నావని విమర్శించారు. 20 స్కామ్‌లపై విచారణకు మేము లేఖ రాశాం. సీఎం రేవంత్‌కు దమ్ముంటే వాటిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

## యుద్ధం సవాళ్ల వేళ ... తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు : ప్రధాని మోడి

(మొదటి పేజీ తరువాయి)

దేశాల మధ్య కొనసాగుతోన్న యుద్ధాలు పరిస్థితులను మార్చేశాయని తెలిపారు. ప్రస్తుతం అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతోన్న యుద్ధం గురించి మాట్లాడారు. గల్ఫ్ దేశాల్లో ఉంటున్న ప్రవాస భారతీయులకు సాయం అందిస్తున్న ఆయా ప్రభుత్వాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇంధన సరఫరాకు కీలకమైన ప్రాంతాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సంక్షోభం తలెత్తిందని వివరించారు. ఈ క్లిష్ట సమయంలో ప్రజలందరూ ఐక్యతతో ఉండాలని మోడి పిలుపునిచ్చారు. తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని కోరారు. సంక్షోభాన్ని రాజకీయం చేస్తున్నవారిని మోడి హెచ్చరించారు. తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని.. ఇది 140 కోట్ల మంది ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన విషయమని అన్నారు. ఇక్కడ స్వార్థపూరిత రాజకీయాలకు తావు లేదని చెప్పారు. తప్పుడు ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం చేసే ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని ప్రధాని మోడి విజ్ఞప్తి చేశారు.

## కూటమి స్ఫూర్తిని మరింత బలోపేతం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

పాటు పార్టీ శ్రేణులందరికీ ఆయన తన అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి కూటమి ఐక్యత అత్యంత కీలకమని, ఈ స్ఫూర్తిని మరింత బలోపేతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.
దివంగత నందమూరి తారక రామారావు 'తెలుగువారి ఆత్మ గౌరవం' అనే నినాదంతో స్థాపించిన తెలుగుదేశం పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక సంచలనం సృష్టించిందని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో బలంగా నిలబడటం వెనుక గొప్ప పోరాట చరిత్ర ఉందని అన్నారు. పార్టీ ప్రస్థానంలో ఎదురైన ఎన్నో క్లిష్ట పరిస్థితులను, ఒడిదుడుకులను చంద్రబాబు తన అపారమైన రాజకీయ అనుభవంతో అధిగమించారని కొనియాడారు. ఆయన నాయకత్వ పటిమ పార్టీ శ్రేణుల్లో స్థైర్యాన్ని నింపిందని ప్రశంసించారు. రాజకీయ లక్ష్యాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే అజెండాగా చంద్రబాబు పార్టీని ముందుకు నడిపించిన తీరు స్ఫూర్తిదాయకమని పవన్ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలోనూ, ప్రజా సమస్యలపై పోరాడటంలోనూ చంద్రబాబు తనదైన ముద్ర వేశారని అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కూటమి ఐక్యతతోనే సాధ్యమని స్పష్టం చేసిన పవన్ కల్యాణ్, ఈ ఐక్యతను, స్నేహబంధాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటూ ముందుకు సాగుదామని తన ప్రకటనలో పిలుపునిచ్చారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 30 మార్చి 2026

# దుండిగల్ సర్కిల్ బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పై మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పర్యటన






**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
మున్సిపల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అధ్యక్షతన దుండిగల్,గండి మైసమ్మ, బహదూర్ పల్లి గ్రామాలలో మూడు చోట్ల డబుల్ బెడ్రూంలో సమస్యలపై పర్యటించి వారికి భరోసా కల్పించిన ఎంపీ ఈటెల రాజేందర్.
ఎంపీ ఈటల మాట్లాడుతూ, దుండిగల్ లో డబుల్ బెడ్రూలలో 37 బ్లాక్ లు 4000 కుటుంబాలు 15 వేల పైగా జనాభా అంటే ఒక చిన్న మున్సిపాలిటీ జనాభా కానీ ఇక్కడ ఇండ్లు కేటాయించిన తర్వాత ప్రజలు ఇక్కడ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని నా దృష్టికి వచ్చింది మీ సమస్యలు ఇప్పటికే ప్రభుత్వం మరియు మంత్రుల దృష్టికి కూడా తీసుకుపోవడం జరిగింది నా దగ్గరికి వస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని నేనే మీ దగ్గరికి వచ్చి ఒకసారి మీ సమస్యలు చూస్తానని నీకు ఆమె ఇచ్చినాను కాబట్టి నేను ఈరోజు మీ దగ్గరికి వచ్చాను అన్నారు.ఇక్కడున్నవారు అందరూ నిరుపేదలే ఎక్కడో పొట్ట చేత పట్టుకొని వచ్చి కూలో నాలో చేసుకుందామంటే ఇక్కడ సరైన పని లేక ఎక్కడో ఉన్న వ్యాపారాలు గాని ఉద్యోగాలు గాని వదిలి ఇక్కడికి రావడం మళ్ళీ అక్కడ వెళ్లి పని చేసుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు డబల్ బెడ్ రూమ్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ వర్ధంతి కార్యక్రమానికి గుబ్బల లక్ష్మీనారాయణకు ఆహ్వాన పత్రిక



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ తెలుగు తల్లి నగర్ కౌండిన్య మహాముని గౌడ సంఘం తెలుగు తల్లి నగర్ వారి ఆధ్వర్యంలో 316 వర్ధంతి కార్యక్రమం లోభాగంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 316వ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా సీనియర్ బిఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేసిన ఎమ్మెస్సార్ కౌండిన్య మహాముని గౌడ సంఘం సభ్యులు.

# ఆరోగ్య భద్రతనిస్తూ మెరుగైన వైద్యాన్ని అందించేది ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసీ..




**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** అనారోగ్యంతో బాధపడుతూ, మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న ఇద్దరూ లబ్ధిదారులకు బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను ఆదివారం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన లబ్దిదారులకు అందజేశారు. ఎల్వోసీ పత్రాల అందజేతలో భాగంగా 131 – కుత్బుల్లాపూర్ డివిజన్ లబ్ధిదారుడు గుద్దిటి రామాంజనేయులు తండ్రి జి. శ్రీరాములు కు 75,000/- (డెబ్బై ఐదు వేల రూపాయలు) మంజూరు కాగా మరొక లబ్ధిదారుడు 127 – రంగారెడ్డి నగర్ డివిజన్ కు చెందిన రాజబోయిన చంద్రయ్య తండ్రి ఆర్.రామయ్య కు 2.00 లక్షలు (రెండు లక్షల రూపాయలు) మంజూరైన ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన నాయకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీమివాస్,ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సుధాకర్,కిషోర్ చారి,శ్రీనాథ్ నార్లకంటి బాలయ్య,ఎర్వ సాయి కిరణ్ (బంటి),అర్షద్, ఎండీ. నసీరుద్దీన్, ఆంజనేయులు, రమణా రెడ్డి,కొత్త నర్సింహా రెడ్డి, జయం చారి,కళ్లెం శ్రీనివాస్, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

# ఎన్ఐఓఎస్ ఓపెన్ స్కూల్లో మహిళలకు పరీక్షలు





**ప్రజావినికిడి,(వాజేడు):మార్చి 30,**
2026 నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) ఆధ్వర్యంలో మండలంలో వివిధ గ్రామాలలో 27 పరీక్ష కేంద్రాలలో అక్షరాస్యులు గా వయోజన విద్య నేర్పిన తరువాత 500 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించడం జరిగినది.వాజేడు మండలం ఎంపిపిఎస్ మురుమూరు కాలనీ గ్రామంలో ఎన్ఐఓఎస్,పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఉల్లాస్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణ బాబు, డిపిఎం కమల, ఎంఈఓ టి వెంకటేశ్వర్లు సర్పంచ్ మడకం సుభద్ర,ఏపీఎం సతీష్ విఓఏలు సంధ్యారాణి, జయలలిత,సీసీలు మల్లీశ్వరి, సత్యనారాయణ, అంగన్వాడీ టీచర్లు మొరుమురు కాలనీ టీచర్స్ మెదలగు వారు పాల్గొన్నారు.

# పేదరికం నుండి వికసించిన పుష్పం ప్రేమ్ చంద్

## తల్లి కన్నీళ్లలో తడిసిన కల విజయంగా వికసించిన ప్రేమ్‌చందు జీవన గాథ:

**ప్రజావినికిడి,(వాజేడు):**
పేదరికం మనిషి లక్ష్యాలకు అడ్డంకి కాదని, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని తన జీవితంలో నిరూపించిన యువకుడు తాటి ప్రేమ్‌చందు.చిన్న గ్రామం పేరూరు,ప్రక్కన ఉన్న చిన్నగొల్లగూడెం,నుంచి ప్రారంభమైన ఆయన ప్రయాణం, ఈరోజు వేల మందికి ప్రేరణగా నిలుస్తోంది.ప్రేమ్‌చందుకు కేవలం రెండు సంవత్సరాల లోపే తండ్రి మరణించడంతో, కుటుంబం తీవ్ర కష్టాల్లో పడింది.ఏ ఆస్తి లేదు ఏ స్థిరమైన ఆదాయం లేదు ఇద్దరు చిన్నపిల్లలతో ఒంటరిగా నిలబడిన తల్లి జీవితాన్ని ముందుకు తీసుకెళ్లడం ఒక పెద్ద సవాల్‌గా మారింది. అయినప్పటికీ,ఆ తల్లి మనసులో ఒకే ఒక్క సంకల్పం వెలిగింది నా పిల్లలు ఎవరిపైనా ఆధారపడకుండా, జీవితంలో ఎలాంటి లోటు లేకుండా ఎదగాలి.అని ఆ ఆలోచనతో ఆమె ఎన్నో కష్టాలు భరించింది. రోజులు గడపడానికి ఎంత కష్టం పడిందో ఆమెకే తెలుసు. తన బాధలను దాచుకొని,పిల్లల భవిష్యత్తు కోసం నిరంతరం పోరాడింది.ఆమె కన్నీళ్లు ప్రేమ్‌చందుకు ప్రేరణగా మారాయి.



విద్యాభ్యాసంలో ప్రేమ్‌చందు చూపిన ప్రతిభ అసాధారణం. పేరూరు ప్రభుత్వ హైస్కూల్‌లో ఎస్సెస్సీ వరకు చదివి,మొదటి ర్యాంక్ సాధించాడు.ఆ తర్వాత ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డిప్లొమా కోర్సుకు అగ్రశ్రేణి ర్యాంక్‌తో ప్రవేశం పొందాడు.అదే పట్టుదలతో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో కూడా టాప్ ర్యాంక్ సాధించి,తన ప్రతిభను మరోసారి నిరూపించాడు.
చిన్నప్పటి నుంచే "మా అమ్మ కష్టాలు వృథా కాకూడదు" అనే సంకల్పంతో ముందుకు సాగిన ప్రేమ్‌చందు,ప్రతి అడుగులో కష్టపడి చివరకు గొప్ప విజయాన్ని అందుకున్నాడు. భారతీయ రైతుల ఎరువుల సహకార సంస్థ (ఐఎఫ్ఎఫ్ సిఓ)లో అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ ట్రైనీగా ఎంపిక కావడం ఆయన జీవితంలో ఒక కీలక మలుపుగా నిలిచింది.
ఈ విజయంతో ఆయన కుటుంబం ఆనందంతో మునిగిపోయింది. ముఖ్యంగా,తన కుమారుడు సాధించిన స్థాయిని చూసిన తల్లి కళ్లలో ఆనందకన్నీళ్లు మెరిశాయి.ఎన్నో నిద్రలేని రాత్రులు, ఎన్నో కష్టాలుఁ అన్నీ ఈ రోజు ఫలించాయి.
కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులు అందరూ ప్రేమ్‌చందు విజయాన్ని చూసి గర్వంగా భావిస్తున్నారు.తాటి ప్రేమ్‌చందు కథ మనకు ఒక గొప్ప సందేశం ఇస్తుంది పేదరికం కాదు అడ్డంకి మనసులో ఉన్న సంకల్పమే నిజమైన శక్తి.తల్లి ఆశలు కృషి, త్యాగం ఉంటే ఏదైనా సాధ్యమే..

# మణికొండలోని అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



**హైదరాబాద్:మార్చి 29 ప్రజావినికిడి,** రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మణికొండలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రిద్దీస్ గ్రాండియర్ అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులోని ఫ్లాట్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో అపార్ట్‌మెంట్‌లోని వాళ్లంతా భయాందోళనకు గురయ్యారు. ఫ్లాట్‌లోని వాషింగ్ మెషీన్‌కు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. ప్రమాదాన్ని గమనించిన యజమాని తన భార్య, ఇద్దరు పిల్లల్ని వెంటనే బయటకు తీసుకెళ్లడంతో వారికి ప్రమాదం తప్పింది

# పరిశ్రమలకు భూములు ఇవ్వలేం




**వికారాబాద్ మార్చి 29 ప్రజావినికిడి,**
పరిగి మండల పరిధిలోని కాళ్లాపూర్ గ్రామంలో పేద రైతుల భూములను ప్రభుత్వం ఇండస్ట్రీయల్ కారిడార్ పేరుతో బలవంతంగా లాక్కుంటుందని రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి. కాళ్లాపూర్ రైతులు గురువారం పరిగి పట్టణంలోని కోడంగల్ చైరస్తా నుంచి బహార్‌పేట్, బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీజాపూర్ జాతీయ రహదారిపై రైతులు బైటాయించి పెద్ద ఎత్తున ధర్నా, నిరసనలు చేశారు. వీరికి బిజేపి, బిఆర్ఎస్, సిపిఎం పార్టీ నాయకులు మద్దతూ ఇచ్చారు. దీంతో ధర్నా, రస్తారోకోకు మరింత బలం చేకూరింది. సిఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్.. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. రైతులు, మహిళ రైతులు, వృద్దులు, పెద్ద ఎత్తున నిరసన చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకుని రైతులను బలవంతగా ధర్నా విరమింపజేసే ప్రయత్నం చేయగా పోలీస్‌లు, రైతుల మధ్య వాగ్వాదాలు మిన్నంటాయి. ఒక్క సారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# సెంట్రలైజ్డ్ పేరుతోని మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు చేయడం విరమించుకోవాలి

**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**
తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ప్రేమ పావని అధ్యక్షతన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవనంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ లు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం విషయంలో కేవలం 600 రూపాయలు వేతనాలు చెల్లిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తుంది అన్నారు.కనీస వేతనాలు 18000 ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును కూడా పట్టించుకోకుండా, కోర్టు ధిక్కరణకు పాల్పడుతుందన్నారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన పదివేల వేతనాల హామీని ఇప్పటికీ నెరవేర్చడంలో వైఫల్యం చెందిందన్నారు. అలాగే వంట సరుకులు గ్యాస్ తో




సహా కోడిగుడ్లు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేస్తుంది అని చెప్పి,ఇప్పటికీ అమలు చేయకుండా, ప్రభుత్వం ఇస్తున్న మెనూ చార్జీలకు, మార్కెట్లో లభిస్తున్న ధరలకు ఎలాంటి పొంతన లేకుండా కార్మికులపై ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతోని హరే రామ హరే కృష్ణ అనే సంస్థకు మధ్యాహ్న భోజన పథకాన్ని కట్టబెట్టడానికి చేసే ప్రయత్నాలను, అందుకు ప్రతి నియోజకవర్గంలో కేటాయించిన స్థలాలను వెంటనే రద్దుచేసి, రాష్ట్రంలో ఉన్న 54200 మంది వంట కార్మికులను రోడ్డున పడేయకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు కుంటాల రాములు, తోపునూరి చక్రపాణి, కార్యదర్శులు ధర్మల రామ్మూర్తి, మీసం లక్ష్మణ్,కోశాధికారి ఆది రంగారెడ్డి, పోలెపోవులు వెంకటేష్, ముంతాజ్, సరస్వతి, సంగీత,వసంత,అంబవ్వ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# గాజులరామారంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..





**టౌన్ ప్లానింగ్ కు విధులు ముఖ్యం కాదు.. అక్రమ నిధులు ముఖ్యం..**

**అనుమతులు ఒకలా నిర్మాణాలు మరోలా.. ప్రభుత్వ ఆదాయానికి గండి..**

**ఫిర్యాదులు చేసిన పట్టించుకోని టౌన్ ప్లానింగ్...**

**నోటీసులు జారీ కానీ... ఫలితం శూన్యం...**





**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రజాపాలనను అటకెక్కిస్తూ అవినీతికే పట్టం కడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి..అక్రమ నిర్మాణాలు రోజురోజుకు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం సర్కిల్ 26 పరిధిలోని మహాదేవపురం, కైలాష్ హిల్స్, వోక్షిత్ ఎంక్లేవ్,ద్వారకా నగర్,మల్లారెడ్డి నగర్,రావి నారాయణరెడ్డి నగర్,శివ సాయి హిల్స్ కరణం కమలమ్మ కాలనీ లో అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. స్టిల్ ూ2 అనుమతులు పొంది స్టిల్ శీ4,శీ5 అదనపు అంతస్తులు నిర్మాణం చేపడుతున్న అధికారులు ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నట్లు ఎక్కడ కనిపించడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సదరూ నిర్మాణదారులతో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కుమ్మక్కై కాసులకు కక్కుర్తి పడి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు వెనుకడు వేస్తున్నట్లు ప్రజలు మండి పడుతున్నారు. పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలు ఈ అక్రమ నిర్మాణాలపై ఉన్నాయని ప్రజలు గుసగుసలాడుతున్నారు. అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై టౌన్ ప్లానింగ్ కిందిస్థాయి నుండి పై స్థాయి అధికారుల వరకు సెటిల్మెంట్లకు తెరుతీస్తున్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నారు. ప్రభుత్వాదాయానికి భారీగా గండి కొట్టి తమ జేబులు నింపుకుంటున్నారని అపవాదులు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గాజులరామారం మహాదేవపురంలో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాలపై అధికారులు తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

# మంత్రుల నియోజకవర్గాలకేనా నిధులు?




**హైదరాబాద్:** ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు నిధులు ఇవ్వ డం లేదని, మంత్రుల నియోజకవర్గాలకు మాత్రమే బిల్లులు వస్తున్నాయని ము నుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం అంటే మంత్రులు మాత్రమే కాదని, ఎమ్మెల్యేలు కూడా భాగమని ఆయన తెలిపారు. తాము నిధుల కోసం మంత్రుల చుట్టూ తిరగాలా? అని ఆయన ఆందోళన వ్య క్తం చేశారు. ఆదివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ము గ్గురు మంత్రులు ఉన్నారని, ప్రభుత్వం ఏం చేసినా, నిధులైనా ఖమ్మం జిల్లాకే వెళుతున్నాయని బయట టాక్ నడుస్తోందని అన్నారు. మంత్రులు, సిఎం నియోజకవర్గాల్లోనే పనులు జరుగుతున్నాయని కాంట్రాక్టర్‌లకు డబ్బులు అందుతున్నాయని ఆయన అన్నారు. ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు నిధులు అందడం లేదని ఆయన పేర్కొన్నారు.రిజర్వాయర్ల కోసం ఎంతోమంది రైతులు భూములిచ్చారని రిజర్వాయర్లు కడితే సరిపోదని కాల్వలు తవ్వించాలని ఆయన డి మాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసుకుంటున్నట్లు తాము కూడా మా నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకోకూడదా? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మునుగోడును అభివృద్ధి చేసుకుందాం అనుకుంటే ఎవరూ సహకరించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మా ప్రభుత్వం ఉన్నా నా నియోజకవర్గానికి అన్యాయం జరుగుతోందని రాజ్ గోపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి న్యాయం జరగనప్పుడు పదవిలోఉండి కూడా వేస్ట్ అంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. మునుగోడులో ఉన్న ఫ్లోరైడ్ ప్రపంచంలో ఎక్కడా లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు లిఫ్ట్‌లన్నీ ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్‌కు తరలిస్తున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తోంది. నిర్ణయాలు, క్రమశిక్షణలో కరెక్ట్‌గా ఉందని ఆయన అన్నారు. అలాగే, నియోజకవర్గాలకు కూడా నిధులు ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వ పెద్దలకు రాజగోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం కట్టారు కమీషన్ల కోసమే కాళేశ్వరం కట్టారని ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరంతో రాష్ట్రం అప్పుల పాలైందన్నారు. లక్షల కోట్లు ఖర్చు చేస్తే మనకు చుక్క నీరు రాలేదన్నారు. గత ప్రభుత్వం పదేండ్లు ప్రజాధనం వృధా చేసిందన్నారు. కెసిఆర్ ఓ నియంతలా పాలించారని, నార్త్ తెలంగాణ, సౌత్ తెలంగాణ పేరుతో వివక్ష చూపారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాక ముందు కాంగ్రెస్ పార్టీ ఎంతో ఆలోచన చేసి ఎన్నో ప్రాజెక్టులను రూపకల్పన చేసిందని ఆయన అన్నారు. తుమ్మిడి హట్టి దగ్గర కట్టాల్సిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కేవలం కాంట్రాక్టర్ల కోసం ఇంజనీర్లు చెప్పిన వినకుండా కెసిఆర్ ఇంజనీర్‌గా మారి మేడిగడ్డకు బ్యారేజీను మార్చారన్నారు. ఇది కూలిపోయే స్థితికి వచ్చిందన్నారు.కాలువలు పూర్తి చేసి పొలాలకు నీరు అందించాలి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు రూ.714 కోట్లతో లక్ష ఎకరాల నీటిని అందించే విధంగా బ్రాహ్మణ వెల్లెంలా ప్రాజెక్టును మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీసుకొచ్చారని ఆయన తెలిపారు. 2004 నుంచి 2014ల మధ్య 90 శాతం ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయన్నారు. 2014 నుంచి బిఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలో ఒక పని కూడా చేయలేద న్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగతా పనులు పూర్తి చేసి బ్రాహ్మణ వెల్లెంలా రిజర్వాయర్‌లోకి నీటిని నింపామని ఆయన తెలిపారు. అయితే, కాలువలు పూర్తికాకపోవడంతో పొలాలకు నీరు రావడం లేదని, తొందరగా కాలువలు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లోని ఎక్కువ మంది విద్యార్థులు గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో విద్య, వైద్యాన్ని గాలికి వదిలేసిందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురావడానికి ప్రయత్నం జరుగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సరిపడా మౌలిక సదుపాయాలు లేవని, ఒక విద్యార్థి ఉన్నచోట ఎక్కువ మంది టీచర్లు ఉన్నారని, 100 విద్యార్థులు ఉన్నచోట ఒక టీచరే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేట్ పాఠశాలల్లోని ఎక్కువ మంది విద్యా ర్థులు చదువుతున్నారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 40 శాతం మెస్ చార్జీలు పెంచినప్పటికీ ఆహారంలో నాణ్యత లేదని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో మానిటరింగ్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఢిల్లీలో బంగారు బాబు గోల్డ్ అంతా సీజ్

### ఇన్కమ్ టాక్స్ అధికారుల అదుపులో "కొండ"

**12 గంటలుగా కొనసాగుతున్న కొండ విజయ్ కుమార్ విచారణ**

**ఆందోళనలో కుటుంబ సభ్యులు, హోప్ ఫౌండేషన్ ప్రతినిధులు, అభిమానులు**



**రంగారెడ్డి:** శేరిలింగంపల్లి చెందిన బంగారు బాబు, హోప్ ఫౌండేషన్, తెలంగాణ హాకీ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ను ఢిల్లీ ఇన్కమ్ టాక్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. న్యూఢిల్లీలో జరుగుతున్న హాకీ ఇండియా అవార్డుల ప్రధానోత్సవానికి బయలుదేరిన కొండ విజయ్ కుమార్ ను హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో గురువారం సాయంత్రం స్థానిక ఐటి అధికారులు అడ్డుకొని పాన్ కార్డు స్వాధీనం చేసుకున్నారు. తదనంతరం కొండ విజయ్ కుమార్ న్యూఢిల్లీ ఎయిర్ పోర్టులో దిగగానే అక్కడి ఢిల్లీ ఇన్కమ్ టాక్స్ అధికారులు నలుగురు వారిని అదుపులోకి తీసుకొని ఎయిర్ పోర్టు లోనే విచారణ ప్రారంభించారు. తనఒంటిపైన ఉన్న బంగారం మొత్తాన్ని సీజ్ చేయడంతో పాటు వారి పేరుతో ఉన్న స్థిర, చర ఆస్తుల వివరాలను సేకరించే పనిలో పడ్డారు. 12 గంటల పాటు విచారించిన అధికారులు అవార్డుల ప్రధానోత్సవానికి వెళ్లడానికి అనుమతిని ఇచ్చారు. అనంతరం మళ్లీ వారిని విచారణకు హాజరు కావాల్సి ఉంది.

## కేరళలో కాంగ్రెస్ కూటమిదే విజయం: మంత్రి పొంగులేటి




కేరళలో కాంగ్రెస్ కూటమి (యూడిఎఫ్) విజయం ఖాయమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార అండ్ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కేరళ రాష్ట్రంలో వచ్చే నెల 9వ తేదీన జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడిఎఫ్) స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి రానుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేరళ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన పతనంతిట్ట జిల్లా లోని అడూర్ అసెంబ్లీ నియోజకవర్గం యూడిఎఫ్ ఎమ్మెల్యే అభ్యర్థి శాంతకుమార్ (కాంగ్రెస్ పార్టీ) మద్దతుగా వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ కూటమి పట్ల ప్రజల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తుందన్నారు.ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి సాధించిన విజయాలు దీనికి నిదర్శనమన్నారు. గత దశాబ్దంగా అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి ఆరోపించారు. అభివృద్ధి పేరుతో ప్రచారం మాత్రమే జరిగిందని, ప్రజలకు అందిన ఫలితాలు తక్కువగా ఉన్నాయని ఆయన విమర్శించారు. పదేళ్ల పాలన తర్వాత కూడా నిరుద్యోగం పెరుగుతుంటే, ప్రజలపై ఆర్థిక భారాలు అధికమవుతుంటే – అది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం కాదా? అని మంత్రి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సెక్యులర్ విలువలను కాపాడే శక్తి కాంగ్రెస్‌కే ఉందని, ఈ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పుతో కాంగ్రెస్ కూటమికి విజయం అందిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఆర్డీటీని కాపాడుకోవడమే పెర్రర్‌కు ఘనమైన నివాళి





## ప్రజా ఉద్యమ విజయగాథ

**అనంతపురం మార్చి 29 ప్రజావినికిడి,**

పేద ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆర్డీటీని కాపాడుకోవడంలోనే ఫాదర్ విన్సెంట్ పెర్రర్ కు ఘన నివాళులు అని అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సాకే హరి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్ సీ ఆర్ ఏ రెన్యువల్ చేసిన శుభ సందర్భంగా అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సాకే హరి అధ్యక్షతన జరిగిన సంబరాలకు ముఖ్యఅతిథిగా ఆర్డీటీ ప్రోగ్రాం చైర్మన్ మాంచో ఫెర్రర్ ముఖ్య అతిథిగా హాజరై ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేసి సంతోషంగా సంబరాలు చేసుకున్నారు. ఆర్డీటీ ఉమ్మడి జిల్లాలో చేసిన సేవలను ఎప్పటికీ మరిచిపోలేమని అలాగే ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ను మా గుండెల్లో దాచుకుంటామన్నారు. 11 నెలలగా ఆర్డీటీ మాకు దూరం అవుతుందన్న భయం,ఆందోళన,దిగులు చెందామని కేంద్రం ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేయడంతో సంతోష పడుతున్నామన్నారు. ఆర్డీటీని కాపాడుకోవడానికి కులం మతాలకు అతీతంగా రోడ్లమీద కొచ్చి ఉద్యమాలు చేసిన సందర్భాలని ఎప్పటికీ మర్చిపోలేమని ఇది పూర్తిగా ప్రజల విజయంగా చాటుతామన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాల్లో ఎవరు అధికారంలో ఉన్న ఆర్డీటీపై ఆంక్షలు,అడ్డంకులు పెట్టకుండా సేవా కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. సుదీర్ఘకాలం పాటు నిరుత్సాహం,భయానికి లోను కాకుండా ధైర్యంగా సేవ్ ఆర్డీటీ,సేవ్ అనంత అంటూ నినదించిన పోరాట నాయకుల త్యాగాలు వృధా కాలేదన్నారు. ఆర్డీటీని కాపాడుకోవడానికి చిత్తశుద్ధితో ఉద్యమించిన ఉద్యమకారులకు అఖిలపక్ష కమిటీ ఘనంగా సన్మానించి సత్కరించింది.

కార్యక్రమంలో వైయస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్,ఆల్ ఇండియా ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ రవిశంకర్, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక కెవి రమణ. అఖిలపక్ష కమిటీ సభ్యులు కేపీ రాజు,సుగమంచి శ్రీనివాసులు,కుంటిమద్ది ఓబులేసు,శిరీషాల అంజి,అనిల్ కుమార్,దాసగానిపల్లి కుల్లాయప్ప,సురేష్,కృష్ణారెడ్డి,షేకన్నా,టీపీ రామన్న,టీవీ రెడ్డి,వేమన,రేగడి కొత్తూరు ఓబులేసు,పూసల హనుమంతు, గట్టు రామాంజనేయులు, వెంకటేష్,రాహుల్,హరినాథ్ రెడ్డి,రాజేష్, ఉరుముల రాము,కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణదుర్గంలో విషాదం : యూరియా నీరు తాగి 20 గొర్రెలు మృతి

**కళ్యాణదుర్గంమార్చి 29 ప్రజావినికిడి,**

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ కాపరికి చెందిన 20 గొర్రెలు కలుషిత నీరు తాగి మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనతో ఆ కాపరి జీవనోపాధిని కోల్పోయి కన్నీరుమున్నీరవుతున్నాడు.

వివరాల్లోకి వెళ్తే.. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామానికి చెందిన ఓబుళపతి అనే కాపరి, రోజూ మాదిరిగానే నిన్న తన 65 గొర్రెలను మేత కోసం గ్రామ సమీపంలోకి తీసుకెళ్లారు. మధ్యాహ్నం సమయంలో గొర్రెలు దాహంతో సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలోకి



వెళ్లాయి. అక్కడ యూరియా కలిపి ఉన్న నీటిని తాగడంతో అస్వస్థతకు గురయ్యాయి. ఆ నీరు తాగిన కాసేపటికే గొర్రెలు ఒక్కొక్కటిగా కుప్పకూలిపోయాయి. తన కళ్ల ముందే 20 గొర్రెలు చనిపోయాయని కాపరి ఓబుళపతి ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల తనకు సుమారు రూ.2.10 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తనకు వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

సమాచారం అందుకున్న పశుసంవర్ధక శాఖ ఏడీ కిరణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతిచెందిన గొర్రెలను పరిశీలించి, మిగిలిన గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు.

### భర్త మృతిని తట్టుకోలేక ఒకరు.. వరకట్న వేధింపులతో మరొకరు...

# చిన్నారులతో తల్లుల బలవన్మరణం

**వరంగల్ మార్చి 29 ప్రజావినికిడి,**

తెలంగాణలో రెండు వేర్వేరు చోట్ల జరిగిన హృదయ విదారక ఘటనలు తీవ్ర కలకలం రేపాయి. సంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో చోటుచేసుకున్న ఈ విషాదాల్లో ముగ్గురు చిన్నారులతో సహా ఇద్దరు తల్లులు ప్రాణాలు కోల్పోయారు. ఒకచోట భర్త మరణంతో కుంగిపోయిన మహిళ తన ఇద్దరు పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకోగా, మరోచోట వరకట్న వేధింపులు భరించలేక ఓ మహిళ తన కుమారుడితో కలిసి కాలువలో దూకింది.

**భర్త మరణంతో మనస్తాపం**

సంగారెడ్డి జిల్లా కంది మండలం జుల్‌కల్‌లో జరిగిన ఘటన స్థానికులను కంటతడి పెట్టించింది. గ్రామానికి చెందిన మమతకు ఎనిమిదేళ్ల క్రితం ప్రవీణ్‌తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు మణికంఠ (5), కూతురు ప్రణయశ్రీ ఉన్నారు. గత జనవరిలో



ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో మమత తీవ్ర మనోవేదనకు గురైంది. భర్త లేని లోకంలో పిల్లలను పోషించలేనన్న ఆవేదనతో శనివారం ఆమె తన ఇద్దరు పిల్లలను గొంతు నులిమి హత్య చేసింది. అనంతరం ఇంట్లోని దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


**వరకట్న వేధింపులు భరించలేక**

వరంగల్ జిల్లాలో మరో విషాదం చోటుచేసుకుంది. కానిస్టేబుల్ హరీశ్ భార్య కల్యాణి, తన మూడేళ్ల కుమారుడు శ్రేయాన్స్‌తో కలిసి ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కొంతకాలంగా భర్త, అత్తింటి వారి నుంచి వరకట్న వేధింపులు ఎదుర్కొంటున్న ఆమె, మనస్తాపంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. శనివారం పుట్టింటికి వచ్చిన ఆమె, కుమారుడితో బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో గల్లంతైన తల్లీకొడుకుల ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ రెండు ఘటనలు ఆయా ప్రాంతాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.

## ఈ ఎమోషనల్ డైలాగుల వల్ల అమరావతి రైతులకు న్యాయం జరగదు: విజయసాయిరెడ్డి

**అమరావతి మార్చి 29 ప్రజావినికిడి,**

రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి ఏపీలోని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు గతంలో ఇస్తామన్న నివాస, వాణిజ్య ప్లాట్లతో పాటు, 2013 భూసేకరణ చట్టం ప్రకారం అదనంగా నష్టపరిహారం కూడా చెల్లించాలని కోరారు. ఈ మేరకు ట్వీట్ చేశారు.“ఒక రైతుగా అడుగుతున్నా. నా అమరావతి రైతు సోదరుల కోసం అధికారపార్టీని అడుగుతున్నా. 2015లో ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన రైతుల్లో ఎవరైనా వారికి కేటాయించిన ప్లాట్‌లో ఇల్లు కట్టుకోగలిగారా? వారిలో ఏ ఒక్క రైతు అయినా వారికి ఇచ్చిన కమర్షియల్ స్థలంలో ఒక షాపింగ్ కాంప్లెక్స్ కట్టగలిగారా? ఈ 11 ఏళ్ళ కాలంలో వారికి కేవలం ఏడాదికి ఇంత అని నామమాత్రంగా డబ్బు ఇవ్వటం వల్ల కలిగిన లాభం ఏమిటి?



రైతుల త్యాగాలు వెల కట్టలేనివి అని నిన్న శాసన సభలో పలువురు సభ్యులు చెప్పారు. ఈ ఎమోషనల్ డైలాగుల వల్ల రైతులకు న్యాయం జరగదు. భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికి అయినా ఇంతకు ముందు మీరు ఇస్తాం అన్న ఇళ్ల స్థలం, కమర్షియల్ స్థలం మాత్రమే కాకుండా, అదనంగా ఫెయిర్ కాంపిన్సేషన్ చట్టం 2013 ప్రకారం నష్ట పరిహారం ఇవ్వండి. అసైన్డ్ భూముల విషయంలో ఒరిజినల్ హక్కుదారులకే నష్ట పరిహారం ఇవ్వండి.

అలాగే మరో విషయాన్ని కూడా అడుగుతున్నా, నిరుపేదలకు గత ప్రభుత్వం కేటాయించిన 50 వేల ఇళ్ల పట్టాలను మీరెందుకు రద్దు చేశారు? ఆ ప్లాట్లను ఆ నిరుపేదలకే తిరిగి ఇవ్వండి. ఒక వైపు లక్షల కోట్లతో రాజధాని కడతాం అంటున్నారు. మీరు కట్టండి కానీ, ఆ భూములు ఇచ్చిన రైతులకే న్యాయం చేయనట్టయితే, ఆ నిర్మించే భారీ భవనాల పునాదులు ఎవరి భూముల్లో నిర్మిస్తున్నారో వారికే సంతృప్తి, సంతోషం కలిగించనట్టయితే ఏమిటి ప్రయోజనం? అలా నిర్మించే రాజధాని వల్ల ఏ ధనికులకి, బూర్జువాలకి లాభం కలుగుతుందో ప్రజలు కూడా ఆలోచన చేస్తారని మీరు కూడా గమనించండి“ అంటూ విజయసాయిరెడ్డి తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# గుండెపోటుతో వ్యక్తి మృతి

**అవుకు మార్చి 29 ప్రజావినికిడి,**



అవుకు గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. నిన్న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో నపరాతి కూలీగా పని చేస్తున్న లింగందిన్నె బాలాజీ (38) అనే వ్యక్తి, నపరాతి లోడును దింపుతున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు.

అక్కడే ఉన్న తోటి కార్మికులు వెంటనే ఆయనను సమీప స్థానిక ఆసుపత్రికి తరలించగా, అప్పటికే బాలాజీ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటు కారణంగానే ఈ మరణం సంభవించినట్లు సమాచారం. మృతుడు బాలాజీకి భార్య వెంకటేశ్వరమ్మతో పాటు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుమారుడు బద్రీనాథ్ (7 సంవత్సరాలు), కూతురు ధనుశ్రీ (4 సంవత్సరాలు) కుటుంబాన్ని పోషించేందుకు బాలాజీ ప్రతిరోజూ నపరాతి కూలీగా పని చేసేవాడు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి విషాదాన్ని జిర్నించుకోలేని కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు దుఃఖసంద్రంలో మునిగిపోయారు

## ఒంటిమిట్టకు 85 వేల లడ్డూలు పంపిన టీటీడీ

**మార్చి 29 ప్రజావినికిడి,**



కడప జిల్లాలోని ఒంటిమిట్టలో ఏప్రిల్ 1న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను టీటీడీ తరలించింది. కల్యాణానికి హాజరయ్యే భక్తులకు పంపిణీ చేసేందుకు మొత్తం 85 వేల లడ్డూలను ఆదివారం ప్రత్యేకంగా ప్యాక్ చేసి ఒంటిమిట్టకు పంపించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో సుమారు 300 మంది శ్రీవారి సేవకులు పాల్గొన్నారు. తిరుమల ఎస్టేట్స్ ఆఫీసర్, డిప్యూటీ ఈఓ (పరకామణి) వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ ప్యాకింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. దాదాపు 200 మందికి పైగా మహిళా సేవకులు, 100 మంది పురుష సేవకులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ సేవలో పాల్గొన్నారు. అనంతరం ఈ లడ్డూలను ప్రత్యేక వాహనాల్లో ఒంటిమిట్టకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్టేట్స్ ఆఫీసర్ మాట్లాడుతూ.. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ రవిచంద్ర, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరిల ఆదేశాల మేరకు కేవలం ఐదు గంటల్లోనే 85 వేల లడ్డూలను ప్యాక్ చేసి, ఒంటిమిట్టకు సకాలంలో చేరేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ శ్రీవారి సేవాసదన్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## గల్ఫ్ ప్రాంతాన్ని సురక్షితంగా దాటిన రెండు భారత నౌకలు

**మార్చి 29 ప్రజావినికిడి,**



గల్ఫ్ ప్రాంతం నుంచి రెండు భారీ ఎల్పీజీ క్యారియర్లు సురక్షితంగా భారత్ తీరం వైపు ప్రయాణిస్తున్నాయి. బీడబ్ల్యూ టీవైఆర్, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ అనే ఈ నౌకల్లో సుమారు 94,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది. ఈ మేరకు ఆదివారం కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, బీడబ్ల్యూ టీవైఆర్ నౌక మార్చి 31న ముంబైకి, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ నౌక ఏప్రిల్ 1న న్యూ మంగళూరుకు చేరుకోనున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న భారత నౌకలు, నావికుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, గత 24 గంటల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 18 భారత నౌకలు, 485 మంది భారత నావికులు ఉన్నట్లు తెలిపింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీ షిప్పింగ్), నౌకల యజమానులు, భారత రాయబార కార్యాలయాలతో కలిసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన డీజీ షిప్పింగ్ కంట్రోల్ రూమ్ 24ఐ7 పనిచేస్తోందని, ఇప్పటివరకు 942 మంది నావికులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయపడిందని పేర్కొంది. గత 24 గంటల్లో నలుగురు నావికులను తరలించినట్టు తెలిపింది.

భారత్‌లోని అన్ని ఓడరేవుల్లో కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగుతున్నాయని, ఎక్కడా రద్దీ లేదని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. విదేశాంగ శాఖ, ఇతర సముద్రయాన భాగస్వాములతో కలిసి నావికుల సంక్షేమం, నిరంతరాయ సముద్ర కార్యకలాపాల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపింది. గల్ఫ్, పశ్చిమాసియా ప్రాంతంలోని భారతీయుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, సహాయం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, 24ఐ7 హెల్ప్‌లైన్‌లు పనిచేస్తున్నాయని విదేశాంగ శాఖ వివరించింది.

## ఆకివీడు రామాలయ పునర్నిర్మాణంపై రఘురామ కీలక ప్రకటన

**మార్చి 29 ప్రజావినికిడి,**

ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కీలక ప్రకటన చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెదపేటలోని పురాతన రామాలయాన్ని పునర్నిర్మించనున్నట్లు తెలిపారు. ఇటీవల శ్రీరామనవమి రోజున తనపై దాడికి యత్నం జరిగిన ప్రదేశంలోనే ఈ ఆలయాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్నట్లు వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



ఈ మేరకు ఆయన ఆదివారం నాడు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. ప్రముఖ హిందూ సంస్థల ఆధ్వర్యంలో, సుప్రసిద్ధ స్థపతి (శిల్పకళా నిపుణుడు) డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గారి నేతృత్వంలో ఈ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. శిల్పకళ, వాస్తు, ఆగమ శాస్త్రాలకు అనుగుణంగా పూర్తిగా కృష్ణ శిలతో ఆలయాన్ని నిర్మిస్తామని, కనీసం 8 శతాబ్దాల పాటు చెక్కుచెదరని విధంగా ఈ నిర్మాణం ఉంటుందని రఘురామ వివరించారు. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఇదే ఆలయం వద్ద రఘురామకృష్ణరాజుపై కొందరు దాడికి యత్నించిన ఘటన కలకలం రేపడం తెలిసిందే.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# భూ బదలాయింపుపై హౌజ్‌కమిటీ వేయాలి.. ఎమ్మెల్యే దానం నాగేందర్ డిమాండ్

**హైదరాబాద్, మార్చి 29:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో గందరగోళ నెలకొంది. సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టి, పోడియం వద్దకు దూసుకెళ్లి నినాదాలు చేశారు. సమావేశాల్లో భాగంగా మాజీ మంత్రి, ప్రస్తుత ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు పెను సంచలనం సృష్టిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని ఆయన చేసిన ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.నా సొంత భూమినే కంపెనీకి ఇచ్చారు..ఎమట?మ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. 'నా సొంత భూమిని కేటీఆర్ ఒక ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టారు. ఆ సమయంలో అధికారంలో చేతిలో ఉండటంతో నేను తీవ్రంగా నష్టపోయాను. నేను హైదరాబాద్‌లో పుట్టి పెరిగినప్పటికీ, అప్పుడు ఏమీ చేయలేక నోరు మూసుకోవాల్సి వచ్చింది. భూ బదలాయింపుల్లో జరిగిన అక్రమాలను వెలికితీయడానికి ప్రభుత్వం తక్షణమే హౌజ్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్న. ఈ అక్రమాలకు సంబంధించిన అన్ని ఆధారాలు, పత్రాలు నా వద్ద ఉన్నాయి. ప్రభుత్వం కోరితే వాటిని సమర్పించడానికి నేను సిద్ధంగా ఉన్నా. నేను వ్యక్తిగతంగా ఎంత నష్టపోయానో నాకు మాత్రమే తెలుసు. ఇవన్నీ బయటకు రావాల్సిన అవసరం ఉంది.రూ. 200 కోట్ల విలువైన భూమి కబ్జా చేశారు..వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 'హన్మకొండలో సుమారు రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ పేరుతో అక్రమంగా దక్కించు కున్నారు. గత ప్రభుత్వ హయాం లో అధికార దుర్వినియోగానికి ఇది పరాకాష్ట. నా ఆరోపణలు నిరూపించకుంటే 48గంటల్లో పదవికి రాజీనామా చేస్తా. బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ భూ దోపిడీపై హౌజ్ కమిటీ వేయాలి. అక్రమంగా నిర్మించిన పార్టీ కార్యాలయాల విషయంలో కఠినంగా వ్యవహరించి, బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలి' అని అన్నారు.లక్షల దోచుకున్నారు. తెలంగాణ అసెంబ్లీ వేదికగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గత పదేళ్ల కాలంలో జరిగిన భూ కేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగాయి. లక్షల ఎకరాలు ప్రభుత్వ భూములను దోచుకున్నారు. ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకొని కంపెనీల యజమానులను బెదిరించారు. వారి వద్ద ఉన్న విలువైన భూములను బలవంతంగా బదలాయించుకున్నారు. ఇదొక వ్యవస్థీకృత దోపిడి. బాలానగర్ ప్రాంతంలో జరిగిన భూ అక్రమాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి' అని అన్నారు.



## చికెన్ ప్రియులకు బిగ్ షాక్.. ఏప్రిల్ 1 నుంచి

**హైదరాబాద్, మార్చి29:** తెలంగాణ రాష్ట్రంలో మాంసం ప్రియులకు కష్టకాలం వచ్చిపడింది. తెలంగాణ రాష్ట్ర చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం మాంసం ప్రియులకు బిగ్ షాక్ ఇచ్చింది. గత కొంత కాలంగా ఫౌల్ట్రీ కంపెనీలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్న?న్నారు. తమకు ఇచ్చే కమీషన్, మార్జిన్ ను భారీగా తగ్గించడాన్ని నిరసిస్తూ ఏప్రిల్1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చికెన్ షాపులను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు. నగర వ్యాప్తంగా దీనికి సంబంధించిన పోస్టర్లు వెలిశాయి. తగ్గించిన మార్జిన్‌ను తిరిగి సవరించి, తమకు న్యాయం చేసే వరకు షాపులు తెరిచేది లేదని స్పష్టం చేశారు.చికెన్ షాపులు మూసివేయడంతో ప్రత్యామ్నాయం చూసుకునే పనిలో పడ్డారు. ముందుగానే చికెన్ కొని ఫ్రిజ్‌లో స్టాక్ చేసుకుంటున్నారు. చికెన్ ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా పచ్చళ్లు పెట్టుకుంటున్నారు. చికెన్ షాపులు ఎక్కువ రోజులు మూసివేస్తే గ్రామీణ ప్రాంతాల్లో నాటు కోళ్ళతో పాటు కోడిగుడ్లు, మాంసం, చేపలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఇటీవల కాలంలో మాంసం ధర వెయ్యి రూపాల వరకు పెరిగిపోవడంతో, చాలా మంది చికెన్ వైపే మొగ్గు చూపుతున్నారు. ఇంట్లో చుట్టాలు వచ్చినా, చిన్న చిన్న ఫంక్షన్లు ఉంటే చికెన్‌కే ప్రాధాన్యత ఇస్తుంటారు. అందుకే చికెన్ షాపులు మూసివేయడం చికెన్ ప్రియుకు ఇబ్బంది పెట్టే విషయం అంటున్నారు. ఈ మూడు రోజుల్లో చికెన్ ఏ రేంజ్‌లో అమ్ముడు పోతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు.




## మమ్మల్ని తొక్కుతామన్నాడు.

**హైదరాబాద్,** అసెంబ్లీని కాంగ్రెస్ ఇష్టానుసారంగా నడిపిస్తుందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. అక్రమ మైనింగ్‌పై హరీశ్‌రావు సభ దృష్టికి తీసుకొచ్చారని.. దానిపై హౌస్ కమిటీ వేయాలని కోరామని తెలిపారు. మేం హౌస్ కమిటీకి డిమాండ్ చేస్తే సీబీ సీఐడీ విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి అన్నారని తెలిపారు. మా డిమాండ్‌ను పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం యత్నించిందని మండి పడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. పొంగులేటి అంశంపై సభాసంఘం వేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. సభాసంఘం అంశాన్ని వదిలేసి సీఎం కులాల ప్రస్తావన తీసుకొచ్చారని పేర్కొన్నారు. కడియం, దానం ఏ పార్టీ సభ్యులని వారికి మాట్లాడే అవకాశం ఇచ్చారని ప్రశ్నించారు. మీరు ఏ పార్టీ వారో చెప్పాలని కౌశిక్ రెడ్డి అడిగారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో అసెంబ్లీలో ఏ కమిటీలు లేవని తలసాని తెలిపారు. స్పీకర్‌ను దళితుడుఅని మేం ఎప్పుడూ భావించలేదని అన్నారు. ఉన్నతమైన వ్యక్తిగానే స్పీకర్‌ను గౌరవించామని పేర్కొన్నారు. మా డిమాండ్‌పై నిరసన తెలియజేస్తుంటే, అటెన్షన్ డైవర్ట్‌లో భాగంగా కులాలకు అంటగట్టే ప్రయత్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేశాడని తెలిపారు. నా వెంట్రుక పీకలేరని కడియం శ్రీహరి వ్యవహారశైలి ఉందన్నారు. సబ్ ఆర్డర్ లేనప్పుడు అనేక అంశాలు జరుగుతుంటాయని చెప్పారు. భట్టి విక్రమార్క అంటే బీఆర్ఎస్‌కు గౌరవమని తెలిపారు. ఆనాడు భట్టి విక్రమార్క పాదయాత్ర చేశాడని ముఖ్యమంత్రి గుర్తుచేశాడని.. భట్టి విక్రమార్కను ముఖ్యమంత్రి చేయొచ్చు కదా అని ప్రశ్నించారు. సభలో అధికార పార్టీ సభ్యుల చేత బీఆర్ఎస్ ను తిట్టించారని తెలిపారు. వెనుకబడి తరగతుల పద్దుల విషయంలో చర్చపై వాస్తవాలు బయటకొస్తాయనే డైవర్షన్ పాలిటిక్స్ ఏస్తున్నారని మండిపడ్డారు. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి వేల కోట్లు పెడుతున్నామని చెప్పి, పద రూపాయల ఖర్చు చేయలేదని తెలిపారు.



## ఆదిలాబాద్, నాగార్జునసాగర్‌లలో ఎయిర్‌పోర్టులు - మామునూరు విమానాశ్రయం ప్రారంభం అప్పుడే!

**హైదరాబాద్, మార్చి 29:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ గతవారం ఆమోదించిన ఉడాన్ 2.0 ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలకు విస్తృత ప్రయోజనాలు కలగనున్నాయని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ పథకం కింద ఇప్పటికే ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌లను ఎయిర్‌పో ర్టులుగా అభివృద్ధి చేసే వీలున్నందున తెలంగాణ రాష్ట్రంలోని నాగార్జునసాగర్‌లలో కొత్త విమానాశ్రయాలు నిర్మించేందుకు వీలుకలుగుతుందని చెప్పారు. కర్నూలు, కడప ఎయిర్‌పోర్టుల నుంచి దిల్లీ, ఇతర నగరాలకు విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని వివరించారు. దిల్లీ సమీపంలోని నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించిన సందర్భంగా ఆయన శనివారం రాత్రి తన నివాసంలో కొత్తగా ఏర్పాటు చేయబోవు విమానాశ్రయాలకు సంబంధించి పలు వివరాలు తెలిపారు.ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి : ప్రస్తుతం కేంద్ర రక్షణశాఖ ఆధీనంలో ఉన్న ఆదిలాబాద్ ఎయిర్‌ఫోర్స్ ఎయిర్‌స్ట్రిప్‌ను తాము స్వాధీనం చేసుకోబోమని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. మిగిలిన భూమిని సేకరించి అందులో ఎయిర్‌పోర్ట్‌ను నిర్మిస్తామని వెల్లడించారు. బేగంపేట ఎయిర్‌పోర్టు రన్‌వే కింద ట్రాఫిక్ టన్నెల్‌నకు అనుమతివ్వడానికి తమకు అభ్యంతరం లేదని రామ్మోహన్ నాయుడు అన్నారు. అందుకు అవసరమైనటువంటి ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తే తాము అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉడాన్ 2.0 ద్వారా కేటాయించిన రూ.28 వేల కోట్లలో రూ.12 వేల కోట్లు 100 ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి వినియోగిస్తామని రామ్మోహన్ నాయుడు చెప్పారు. 200 హెలిపోర్టుల నిర్మాణానికి రూ.3,500 కోట్లు ఖర్చు చేయనున్నామని వెల్లడించారు. మరో రూ.10వేల కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద విమానయాన సంస్థలకు ఇవ్వనున్నట్లుగా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భోగాపురం కొత్త విమానాశ్రయం, విజయవాడలో విస్తరించిన విమానాశ్రయం రెండూ జూన్‌కల్లా అందుబాటులోకి వస్తాయని ఆయన వివరించారు. జూన్‌లో మామునూరు శంకుస్థాపనకు ఏర్పాట్లు : తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ సమీపంలోని మామునూరు విమానాశ్రయ దస్త్రం ప్రస్తుతం అంతర్‌మంత్రిత్వశాఖల సంప్రదింపుల దశలో ఉంది. ఈ ఎయిర్?పోర్టులో భాగస్వామ్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. కానీ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించే ఎయిర్‌పోపై ఎంబ్రాయిర్ అనే సంస్థ రెండు మూడునెలల్లో నిర్ణయం తీసుకోనుంది. 2028 చివరినాటికి దేశంలో తయారుచేసిన తొలి విమానాన్ని బయటికి తీసుకురావాలన్నది ఆ సంస్థ ఉద్దేశమని రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు.ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్ : ఓరుగల్లు నగరంలో మామునూరు ఎయిర్?పోర్టు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం విదితమే. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో మరో విమానాశ్రయం ఉండకూడదని గతంలో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం ఉంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి రామ్మోహన్? నాయుడు జీఎంఆర్ సంస్థతో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. ఈ విషయం తర్వాత మామునూరుకు జీఎంఆర్ సంస్థ అంగీకారం తెలిపింది. నిర్మాణ పనులను చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశించారు.అభివృద్ధికి దోహదం : విమానాశ్రయం ఏర్పాటు అంశం ఒక్కో దశ దాటుతూ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే ఓరుగల్లు రింగు రోడ్డు ప్రాజెక్టుల విషయంలో కదలిక వచ్చింది. ఉత్తర తెలంగాణలో పెద్ద నగరంగా ఉన్న ఈ ప్రాంతంలో విమాన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లయితే రవాణా రంగం మరింత అభివృద్ధి సాధించటానికి దోహదం చేస్తుందని స్థానికులు చెబుతున్నారు. శివారు ప్రాంతాల్లో భూముల ధరలు పెరగటం, పలు మార్గాల్లో వ్యాపార సంస్థలు విస్తరించటం లాంటివాటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. దీంతో వాణిజ్యపరంగా వరంగల్ వృద్ధి చెందుతుందనే అభిప్రాయం స్థానికుల నుంచి వ్యక్తమవుతుంది.



## ఈ 19 కుంభకోణాలపై విచారణ జరిపించాలి : సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ లేఖ

**హైదరాబాద్, మార్చి 29:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ శాసనస భాపక్షం లేఖ రాసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి కుంభకోణాలపై విచారణ జరపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ లేఖలో డిమాండ్ చేశారు. అవినీతి, కుంభకోణాలపై సభా సంఘం లేదా సిట్టింగ్ జడ్జితో పాటు మరో 19 అంశాలపై విచారణ చేయించాలని పేర్కొ న్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులతో సహా ఇతర ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామా చేయాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం సభ్యులు డిమాండ్ చేశారు.అవినీతి, కుంభకోణాలపై లేఖ రాస్తే విచారణ జరుపుతామని శాసనసభలో స్వయంగా సీఎం ప్రకటించారని, కాంగ్రెస్ పాలనలో జరిగిన కుంభకోణాల వివరాలు అందిస్తున్నామని ఆ లేఖతో పేర్కొన్నారు. మాటపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఈ కుంభకోణాలపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, ఇందులో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాధనాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.




బీఆర్ఎస్ విచారణ కోరుతున్న 19 అంశాలు ఇవే :సివిల్ సప్లై స్కామ్ అమృత్ టెండర్ల స్కామ్ కేఎల్ఎస్ఆర్ స్కామ్ నైనీ కోల్ బ్లాక్ -- సింగరేణి స్కామ్ సింగరేణి ఓబీ స్కామ్ సోలార్ పవర్ స్కామ్ ఎన్టీపీసీ థర్మల్ పవర్ స్కామ్ హెచ్‌సీయూ భూముల స్కామ్ గచర్ల ల్యాండ్ స్కామ్ కోటి ఎకరాల భూమి నిషేధిత జాబితా స్కామ్‌ఎక్స్చేంజ్ మైక్రో బ్రూవరీ స్కామ్‌హమ్ రోడ్స్ స్కామ్ టీడీఆర్ స్కామ్ యంగ్ ఇండియా స్కూల్స్ స్కామ్ ఫోర్త్ సిటీ స్కామ్ హిల్ టీపీ స్కామ్‌అక్రమ మైనింగ్ స్కామ్ దెక్కన్ సిమెంట్స్ స్కామ్ మంచి రేవుల దేవాదాయ భూముల కుంభకోణంసిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి : అంతకుముందు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవ హారంపై సభా సంఘం వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అక్రమ మైనింగ్ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చెయ్యాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్?లోని గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. ఆ పార్టీ నేతలు హరీశ్?రావు, కేటీఆర్ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. శాసనసభ సమావేశాలకు వెళ్తూ ప్లకార్డులు ప్రదర్శించి ఆందోళనకు దిగారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై ఆధారాలతో సహా బయట పెట్టామని, అవినీతి మంత్రిపై హౌస్ కమిటీ వెయ్యాలని, అవసరమైతే సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ఇతర సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై ఎందుకు అలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తప్పుచేయకపోతే భయమెందుకని నిలదీశారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూసి, దిగి రాకపోతే గవర్నర్‌ను కలిసి చర్యలు తీసుకో వాలని అడుగుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి కుటుంబాన్ని ఎందుకు కాపాడాలని ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. మెట్రో భూముల అంశంపై ప్రభుత్వ చర్యలను కేటీఆర్ తప్పుబట్టారు. కాంగ్రెస్ అడ్డగోలు పాలనపై బీజేపీ మద్దతు ఇస్తున్నట్లు ఉందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై పోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తేల్చిచెప్పారు "రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దూరపు బంధువులది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారు. ఒప్పుకున్నారు. ముఖ్యమంత్రి వాటా ఉన్నం దుకు చర్య తీసుకోవడం లేదా మంత్రి పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డిని బర్తరఫ్ చేయాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం దిగిరాకపోతే గవర్నర్‌ను కలుస్తాం. గవర్నర్‌ను కలిసి పొంగు లేటిని బర్తరఫ్ చేసి చర్యలు తీసుకోవాలని కోరతాం" – కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే.


## ఎన్ని విచారణలు వేసినా.. ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటాం

**హైదరాబాద్,**
అసెంబ్లీలో తమకు మైక్ ఇవ్వడం లేదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మైక్ ఇచ్చినా కూడా కట్ చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. జీరో అవర్‌ను గంటలు గంటలుగా నడిపిస్తున్నారని తెలిపారు. ఎన్ని ప్రశ్నలు లేవనెత్తినా సూటిగా సమాధానం ఇవ్వడం లేదని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేసిందేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కాంగ్రెస్ ఏం చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని మండిపడ్డారు. చాలా కుంభకోణాలు బయటపెడితే సమాధానం ఉండదని అన్నారు. అక్రమ మైనింగ్‌ను హరీశ్‌రావు సభ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. మైనింగ్‌ను సీజ్ చేయకుండా నోటీసులు ఇవ్వమేంటని ప్రశ్నించారు. తప్పు చేయనప్పుడు కాంగ్రెస్‌కు భయమెందుకు అని అడిగారు. ప్రభుత్వ అవినీతిని సభలో ప్రస్తావిస్తున్నామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మైనింగ్ అక్రమాలపై ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదని అన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.ప్రతిపక్షంగా ప్రజల సమస్యలు ఎత్తి చూపిస్తామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కులాన్ని తీసుకొచ్చి మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సీతక్కను ఏమని అవమానించామని ప్రశ్నించారు. రైతుబంధు, యూరియా, నీళ్లు వస్తలేవని అడగొద్దా అని నిలదీశారు. అసెంబ్లీలో ప్రజల సమస్యలే కదా మాట్లాడేదని అని అడిగారు.



## జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 7,624 కేసుల పరిష్కారం

ఈ నెల 28న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కేసులను వేగవంతంగా పరిష్కరించడంలో పోలీసు శాఖ, న్యాయవిభాగం, ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో విశేష ఫలితాలు వచ్చాయని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ లోక్ అదాలత్ నిర్వహించామని పేర్కొన్నారు. ఇందులో మొత్తం 7,624 కేసులు విజయవంతంగా వెల్లడించారు.జాతీయ లోక్ అదాలత్ వంటి కార్యక్రమాలు ప్రజలకు త్వరిత న్యాయం అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని శరత్ చంద్ర పవార్ తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులను పరస్పర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కరించడం ద్వారా కోర్టులపై భారం తగ్గించడంతో పాటు, ప్రజల సమయం, ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు.
ప్రజలు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందగలరని తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాల్లో కూడా ప్రజలు చురుకుగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు, సంబంధిత శాఖల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో కేసుల పరిష్కారం సాధ్యమైందని చెప్పారు.




## హరీశ్‌తో జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్‌కు సీఎం సలహా: బండి సంజయ్

**హైదరాబాద్, మార్చి 29:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సీఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కైయ్యారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. అందుకే కేటీఆర్‌పై ఉన్న అవినీతి కేసుల జోలికి సీఎం రేవంత్ రెడ్డి పోవడం లేదని ఆరోపించారు. కల్వకుంట్ల కవిత, కేటీఆర్‌లకు సయోధ్య కుదుర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి మధ్యవర్తి పాత్ర పోషిస్తున్నరని వ్యంగ్యంగా అన్నారు. హరీశ్ రావును మాత్రమే లక్ష్యంగా చేసుకుని కాళేశ్వరంలోని కొంత భాగం అవినీతిపై మాత్రమే మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరంలో జరిగిన రూ.లక్ష కోట్ల అవినీతిపై విచారణ జరిపితే మొత్తం బండారం బయపటపడుతుందనే భయంతోనే అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ అవినీతిపైనే విచారణకు పరిమితం అయ్యారని విమర్శించారు.ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో కాళేశ్వరం అంశంపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించగా ఆయన పైవిధంగా స్పందించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు నడిపిస్తున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ ఒక్కటేనన్నారు. హరీశ్ రావుతో జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్‌కు సీఎం రేవంత్ సలహా ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంతోపాటు హరీశ్‌పై ఉన్నంత పగ కేటీఆర్‌పై సీఎం రేవంత్‌కు లేదని తెలిపారు. అందుకే ఈ ఫార్ములా రేసులు, డ్రగ్స్, ఫాంహౌస్ కేసులపై సీఎం రేవంత్ మాట్లాడటం లేదని గుర్తుచేశారు. కేటీఆర్‌పై రేవంత్ చాలా ప్రేమ ఒలకపోస్తున్నాడని వ్యంగ్యంగా అన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారని జోస్యం చెప్పారు. నూరు శాతం కేటీఆర్, రేవంత్ రెడ్డి ఒక్కటేనని బల్లగుద్ది స్పష్టం చేశారు.కేసీఆర్‌పై ఉన్న కోపం కూడా రేవంత్‌కు పోయిందన్నారు. ఇద్దరి మధ్య డీల్ కుదిరిందని చెప్పారు. అందుకే హరీశ్‌ను మాత్రమే లక్ష్యంగా చేస్తున్నారే తప్ప కేటీఆర్ గురించి మాట్లాడటం లేదని వివరించారు. అందుకే ఆలోచించుకోవాలంటూ హరీశ్‌కు సూచించారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి ఒక్కటా? కాదా? అనేది ఆయనే తేల్చుకోవాలంటూ హరీశ్‌కు హితవు పలికారు.కాళేశ్వరంపై మాత్రమే సీబీఐ విచారణ జరపాలని సీఎం రేవంత్ రెడ్డి కోరుతున్నారని పేర్కొన్నారు. మరి మిగతా అవినీతి కేసుల పరిస్థితి ఏమిటి? పోనీ కాళేశ్వరంపై విచారణ జరపాలని భావిస్తే... లక్ష కోట్ల రూపాయలకుపైగా అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డే చెప్పారు కదా? మరి సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డకు సంబంధించి రూ.9 వేల కోట్ల అవినీతిపైనే సీబీఐ విచారణ జరపాలని ఎందుకు పట్టుపడుతున్నట్లు? అంటూ సందేహం వ్యక్తం చేశారు. అందులోనే హరీష్ పాత్ర ఉన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారన్నారు.



# సీఎస్‌కే ఫ్యాన్స్‌కు షాకింగ్ న్యూస్- ఐపీఎల్‌కు రెండు వారాలపాటు ధోనీ దూరం



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) అభిమానులకు ఊహించని షాక్ తగిలింది. జట్టు కీలక ఆటగాడు, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గాయపడినట్లు ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించింది. కాలికి సంబంధించిన కండరాల గాయం కారణంగా ధోనీ టోర్నీలో తొలి రెండు వారాల పాటు మ్యాచ్‌లకు దూరంగా ఉండనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని సీఎస్‌కే యాజమాన్యం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.గత కొన్ని రోజులుగా ధోనీ ప్రాక్టీస్ సెషన్లలో చురుగ్గా పాల్గొంటూ కనిపించాడు. బ్యాటింగ్, వికెట్ కీపింగ్‌లోనూ తనదైన శైలిలో మెప్పించాడు. సీఎస్‌కే కూడా అతడి ప్రాక్టీస్ వీడియోలను అభిమానులతో పంచుకుంటూ వచ్చింది. అయితే ప్రాక్టీస్ సమయంలోనే ధోనీ కాలిపిక్క కండరానికి గాయం కావడం జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. వైద్యుల సూచన మేరకు అతడు కనీసం రెండు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోంది.ఈ పరిణామంతో ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లకు ధోనీ అందుబాటులో ఉండకపోవడం ఖాయం అయింది. కనీసం నాలుగు మ్యాచ్‌లకు అతడు దూరమయ్యే అవకాశం ఉందని సమాచారం. మార్చి 30న సీఎస్‌కే తన తొలి మ్యాచ్‌ను రాజస్థాన్ రాయల్స్?తో ఆడనుంది. ఆ తర్వాత ఏప్రిల్ 3న పంజాబ్ కింగ్స్, ఏప్రిల్ 5న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఏప్రిల్ 11న ఢిల్లీ క్యాపిటల్స్?తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లకు ధోనీ దూరంగా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అతడు ఫిట్‌గా మారితే ఏప్రిల్ 14న కోల్?కతా నైట్ రైడర్స్?తో జరిగే మ్యాచ్‌లో తిరిగి జట్టులో చేరే అవకాశం ఉందని అంచనా.ధోనీ గైర్హాజరీలో జట్టుపై అదనపు భారం పడనుంది. కెప్టెన్ రుతురాజ్

# భారత్‌కు భారీ గుడ్‌న్యూస్! ఇక గ్యాస్ కష్టాలు తీరిపోయినట్టేనా?




హోర్ముజ్ జలసంధిని ఇరాన్ ప్రభుత్వం మూసివేసినప్పటికీ, భారత్‌కు ఎల్‌పిజి సరఫరాలు క్రమంగా పునఃప్రారంభమవుతున్నాయి. షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం 'దీఔ జుశ్రీఎ', 'దీఔ ుఎతీవ' అనే రెండు ఎల్‌పిజి ట్యాంకర్లు ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి గుండా భారత్ వైపు ప్రయాణిస్తున్నాయి. నౌకా రవాణా దాదాపుగా నిలిచిపోయిన ఈ కీలక సముద్ర మార్గంలో ఇది ముఖ్యమైన పరిణామంగా భావిస్తున్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే. అయితే తమ అనుమతితో శత్రుత్వం లేని నౌకలు ఈ మార్గం గుండా ప్రయాణించవచ్చని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భారత జెండా కలిగిన నౌకలు గల్ఫ్ ప్రాంతాన్ని దాటి తూర్పు వైపు కదులుతున్నాయి. ఇప్పటికే 'శివాలిక్', 'నందా దేవి', 'పైన్ గ్యాస్', 'జగ్ వసంత్' వంటి ట్యాంకర్లు ముందుకు సాగాయి.ఇంకా మరోవైపు, గల్ఫ్ ప్రాంతంలో అనేక నౌకలు చిక్కుకుపోయిన పరిస్థితి కొనసాగుతోంది. శుక్రవారం నాటికి ఐదు ఎల్‌పిజి ట్యాంకర్లతో పాటు సుమారు 20 భారతీయ నౌకలు అక్కడే నిలిచిపోయాయి. 'జగ్ విక్రమ్', 'గ్రీన్ ఆశా', 'గ్రీన్ సాన్వి' వంటి నౌకలు పశ్చిమ హోర్ముజ్ ప్రాంతంలోనే ఉండిపోయాయి. ఈ పరిణామాల మధ్య భారత్‌లో గ్యాస్ సంక్షోభం తీవ్రంగా మారుతోంది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఎల్‌పిజి దిగుమతిదారైన భారత్‌లో సరఫరా లోటు పెరుగుతోంది. దేశీయ అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం పరిశ్రమలకు గ్యాస్ సరఫరాను తగ్గించే చర్యలు తీసుకుంటోంది. గణాంకాల ప్రకారం భారత్ గత సంవత్సరం 33.15 మిలియన్ టన్నుల ఎల్‌పిజిని వినియోగించింది. ఇందులో సుమారు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చింది. ముఖ్యంగా, ఈ దిగుమతుల్లో దాదాపు 90 శాతం మధ్యప్రాచ్య దేశాలపై ఆధారపడి ఉండటం ప్రస్తుత సంక్షోభాన్ని మరింత తీవ్రమయ్యేలా చేస్తోంది. అయితే పరిస్థితి క్రమంగా మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు. గల్ఫ్ ప్రాంతంలో చిక్కుకుపోయిన ఖాళీ నౌకల్లోకి ఎల్‌పిజిని లోడ్ చేసి, సరఫరాలను త్వరగా పునరుద్ధరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.




# ఐపీఎల్ 2026 ఆరంభంలోనే వివాదం..

ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభమే వివాదంతో మొదలైంది. శనివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (రా=ఎ) మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో ఒక వివాదాస్పద క్యాచ్ సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది. ఆర్సీబీ ప్లేయర్ ఫిల్ సాల్ట్ బౌండరీ లైన్ వద్ద పట్టిన క్యాచ్‌పై థర్డ్ అంపైర్ ఇచ్చిన నిర్ణయంపై నెటిజన్లు, క్రికెట్ విశ్లేషకులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇది అంపైరింగ్ తప్పిదం అంటూ ఫ్యాన్స్ విమర్శల వర్షం కురిపిస్తున్నారు. సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ 14వ ఓవర్లో ఈ ఘటన చోటుచేసుకుంది. రోమారియో షెపర్డ్ వేసిన షార్ట్ డెలివరీని హెన్రిక్ క్లాసెన్ మిడ్-వికెట్ వైపు బలంగా బాదాడు. బౌండరీ వద్ద ఉన్న ఫిల్ సాల్ట్ వెనక్కి పరుగెత్తుతూ గాలిలోకి ఎగిరి బంతిని అందుకున్నాడు. అయితే, అతను కింద పడే క్రమంలో అతని వెనుక భాగం లేదా పాదం బౌండరీ కుషన్‌ను తాకినట్లు రీప్లేలో కనిపించింది. ముఖ్యంగా కుషన్ స్వల్పంగా కదలడం టీవీల్లో స్పష్టంగా తెలిసింది. కానీ, థర్డ్ అంపైర్ అన్ని యాంగిల్స్ సరిగ్గా చూడకుండానే, ముఖ్యంగా బ్యాక్ యాంగిల్ చెక్ చేయకుండానే క్లాసెన్ అవుట్ దారితీసింది.మైఖేల్ వాన్ ఏమన్నారంటే?ఈ నిర్ణయంపై ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ ట్విట్టర్ వేదికగా ఘాటుగా స్పందించారు. "నాకు తెలిసైతే ఫిల్ సాల్ట్ పాదం ఖచ్చితంగా బౌండరీ స్పాంజ్ (కుషన్)ను తాకింది. అది ఆర్సీబీకి అనుకూలంగా వచ్చిన పెద్ద నిర్ణయం. అసలు ఎటువంటి సందేహం లేకుండా దాన్ని అవుట్ అని ఎలా ఇస్తారు? కుషన్ కూడా కదిలింది కదా" అని వాన్ ప్రశ్నించారు. పెవిలియన్‌కు పంపడం ఏమాత్రం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.జూమ్ చేసి చూస్తే ఏమైంది?సోషల్ మీడియాలో అభిమానులు ఈ క్యాచ్‌ను జూమ్ చేసి స్క్రీన్ షాట్లు పెడుతున్నారు. సాల్ట్ బంతిని పట్టుకుని కిందకు వంగినప్పుడు అతని టీ-షర్ట్ లేదా బ్యాక్ సైడ్ కుషన్‌ను తాకడం వల్ల కుషన్ తన స్థానం నుంచి కాస్త పక్కకు జరగడం వీడియోల్లో కనిపిస్తోంది. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద బ్యాటర్‌కు అనుకూలంగా నిర్ణయం ఇవ్వాలి. కానీ అంపైర్ తొందరపడి అవుట్ ఇవ్వడంతో హైదరాబాద్ టీమ్ ఒక కీలక వికెట్‌ను కోల్పోవాల్సి వచ్చింది. దీనివల్ల క్లాసెన్ (31 పరుగులు) ఇన్నింగ్స్ అర్ధాంతరంగా ముగిసింది.

# బంగారం, వెండి ధరలకు బ్రేకులు



ఈ రోజు బంగారం, వెండి ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. స్థిరంగా కొనసాగుతున్నాయి. కానీ గత రెండు రోజులుగా బంగారం, వెండి ధరలు భారీగానే పెరుగుతున్నాయి. గతంలో రికార్డు స్థాయిలో పెరిగిన ధరలు.. గత కొన్ని రోజులుగా అంతే రికార్డు స్థాయిలో దిగి వస్తున్నాయి. తాజాగా మార్చి 29వ తేదీన బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. మరి ఈ రోజుబెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.కేరళలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.

ఇక వెండి విషయానికొస్తే.. ధర స్థిరంగా కొనసాగుతోంది. కిలో వెండి ధర హైదరాబాద్, చెన్నై, కేరళలలో రూ.2,50,000 ఉండగా, ఇతర నగరాల్లో 2,45,000 రూపాయల వద్ద ట్రేడవుతోంది.అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం వ్యాపారం ప్రధానంగా అమెరికన ప్రధాన నగరాల్లో ధరలను తెలుసుకుందాం..

ఇది కూడా చదవండి: జశ్రీఝఅఱఅస్త్ర ుఅజూం: మీ ఇంటి పైకప్పు మీద ఉన్న ట్యాంక్ మురికిగా ఉందా? ఈ సింపుల్ చిట్కాలతో చిటికలో క్లీనింగ్హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.

విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,220 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.

ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,020 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,600 వద్ద కొనసాగుతోంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.కేరళలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.


ఇక వెండి విషయానికొస్తే.. ధర స్థిరంగా కొనసాగుతోంది. కిలో వెండి ధర హైదరాబాద్, చెన్నై, కేరళలలో రూ.2,50,000 ఉండగా, ఇతర నగరాల్లో 2,45,000 రూపాయల వద్ద ట్రేడవుతోంది.అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం వ్యాపారం ప్రధానంగా అమెరికన్ డాలర్‌లోనే జరుగుతుంది. డాలర్ బలపడితే ఇతర దేశాల కరెన్సీలతో కొనుగోలు చేసే వారికి బంగారం ఖరీదుగా అనిపిస్తుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా కొనుగోలు తగ్గుతుంది. డిమాండ్ తగ్గడం వల్ల సహజంగానే బంగారం ధరలపై ప్రభావం పడుతుంది. ఈ ధరలు ఉదయం 6 గంటతలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగవచ్చు.

# 16 ఏళ్ల నిరీక్షణకు ఇచ్చిపడేశారుగా




సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్దేశించిన 202 పరుగుల భారీ లక్ష్యాన్ని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కేవలం 15.4 ఓవర్లలోనే ఛేదించి దిమ్మతిరిగే షాకిచ్చింది. బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో 200 పరుగులకు పైగా లక్ష్యాన్ని ఆర్సీబీ ఛేదించడం ఇది రెండోసారి మాత్రమే. గతంలో 2010లో పంజాబ్ జట్టుపై బెంగళూరు ఈ ఘనత సాధించింది. సుదీర్ఘమైన 16 ఏళ్ల నిరీక్షణ తర్వాత మళ్ళీ సొంత మైదానంలో ఇంతటి భారీ లక్ష్యాన్ని విజయవంతంగా అధిగమించి చరిత్ర సృష్టించింది.ఈ విజయం కేవలం 16 ఏళ్ల నిరీక్షణను ముగించడమే కాకుండా, ఐపీఎల్ చరిత్రలోనే ఒక సరికొత్త మైలురాయిని నెలకొల్పింది. 200 కంటే ఎక్కువ పరుగుల లక్ష్యాన్ని అత్యంత వేగంగా ఛేదించిన జట్టుగా ఆర్సీబీ నిలిచింది. గతంలో 2025లో గుజరాత్ జట్టుపై రాజస్థాన్ రాయల్స్ 15.5 ఓవర్లలో ఈ ఘనత సాధించగా, ఇప్పుడు ఆర్సీబీ 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ముగించి ఆ రికార్డును తన పేరుతో రాసుకుంది.ఈ విజయం కేవలం 16 ఏళ్ల నిరీక్షణను ముగించడమే కాకుండా, ఐపీఎల్ చరిత్రలోనే ఒక సరికొత్త మైలురాయిని నెలకొల్పింది. 200 కంటే ఎక్కువ పరుగుల లక్ష్యాన్ని అత్యంత వేగంగా ఛేదించిన జట్టుగా ఆర్సీబీ నిలిచింది. గతంలో 2025లో గుజరాత్ జట్టుపై రాజస్థాన్ రాయల్స్ 15.5 ఓవర్లలో ఈ ఘనత సాధించగా, ఇప్పుడు ఆర్సీబీ 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ముగించి ఆ రికార్డును తన పేరుతో రాసుకుంది.ఈ చారిత్రాత్మక విజయానికి యువ ఆటగాడు దేవదత్ పడిక్కల్ పునాది వేశాడు. కేవలం 26 బంతుల్లోనే 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 61 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. మరోవైపు వెటరన్ స్టార్ విరాట్ కోహ్లీ తన క్లాస్ ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. 38 బంతుల్లో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచి జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. వీరిద్దరి ధాటికి హైదరాబాద్ బౌలర్లు చేతులెత్తేశారు.ఈ చారిత్రాత్మక విజయానికి యువ ఆటగాడు దేవదత్ పడిక్కల్ పునాది వేశాడు. కేవలం 26 బంతుల్లోనే 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 61 పరుగులు చేసి ప్రతు వెటరన్ స్టార్ విరాట్ కోహ్లీ తన క్లాస్ ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. 38 బంతుల్లో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచి జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. వీరిద్దరి ధాటికి హైదరాబాద్ బౌలర్లు చేతులెత్తేశారు.బ్యాటింగ్‌కు ముందు బౌలింగ్‌లోనూ ఆర్సీబీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ఐపీఎల్ అరంగేట్రం చేసిన జాకబ్ డఫీ అద్భుత ప్రదర్శన చేశాడు. 4 ఓవర్లలో కేవలం 22 పరుగులు మాత్రమే ఇచ్చి అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, నితీష్ కుమార్ రెడ్డి వంటి కీలక వికెట్లను పడగొట్టాడు. బ్యాటింగ్‌కు ముందు బౌలింగ్‌లోనూ ఆర్సీబీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ఐపీఎల్ అరంగేట్రం చేసిన జాకబ్ డఫీ అద్భుత ప్రదర్శన చేశాడు. 4 ఓవర్లలో కేవలం 22 పరుగులు మాత్రమే ఇచ్చి అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, నితీష్ కుమార్ రెడ్డి వంటి కీలక వికెట్లను పడగొట్టాడు.డఫీ స్పెల్ కారణంగానే హైదరాబాద్ జట్టు మరీ భారీ స్కోరు చేయకుండా అడ్డుకోగలిగారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన బెంగళూరు, 2026 సీజన్‌ను ఘనంగా ప్రారంభించింది. దీంతో మరోసారి ట్రోఫీ ఆర్సీబీ ఖాతాలోకి చేరుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇదే ఫాం కంటిన్యూ చేస్తే వరుసగా రెండోసారి ట్రోఫీని దక్కించుకునే అవకాశం ఉంది.

# దూసుకెళ్తున్న హైదరాబాద్, బెంగళూరు!



దక్షిణ భారతదేశంలోని ప్రముఖ టెక్ హబ్‌లు బెంగళూరు, హైదరాబాద్ దేశ పట్టణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఎ=ఎఔఎ 2026 నివేదిక ప్రకారం గత ఐదేళ్లలో ప్రధాన నగరాల్లో చేర్చబడిన ఏ-గ్రేడ్ ఆఫీస్ స్పేస్‌లో సుమారు 53 శాతం ఈ రెండు నగరాల వాటానే కావడం వాటి ప్రాధాన్యతను స్పష్టంగా చూపిస్తోంది. ఇండియాస్పోరా గ్లోబల్ ఏఐ సమ్మిట్ 2026లో విడుదలైన ఈ నివేదిక ఈ నగరాలు ఇప్పుడు ఢిల్లీ చీజ=, ముంబై వంటి సాంప్రదాయ ఆర్థిక కేంద్రాలకు సవాలు విసురుతున్నాయని పేర్కొంది. విమానయాన రంగంలో కూడా ఈ రెండు నగరాలు తమ ఆధిపత్యాన్ని చాటుతున్నాయి. గత రెండేళ్లలో దేశంలోని అగ్ర ఎనిమిది నగరాలకు కొత్త దేశీయ విమాన కార్యకలాపాల్లో దాదాపు 50 శాతం ఈ నగరాల నుంచే వచ్చాయి.వ్యాపార రంగంలోనూ ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. 2024--25లో నమోదు కానున్న ప్రతి నాలుగు కొత్త కంపెనీలలో ఒకటి ఈ రెండు నగరాల్లోనే స్థాపించబడుతుండటం, పెట్టుబడులు మరియు వ్యాపార అవకాశాలు ఎలా కేంద్రీకృతమవుతున్నాయో సూచిస్తోంది. బెంగళూరు ఇప్పటికీ దేశంలో స్టార్టప్‌లకు కేంద్రంగా నిలుస్తోంది. టెక్నాలజీ ఆవిష్కరణలు, వెంచర్ క్యాపిటల్ పెట్టుబడులు, ట్టుబడులు మరియు వ్యాపార అవకాశాలు ఎలా కేంద్రీకృతమవుతున్నాయో సూచిస్తోంది. బెంగళూరు ఇప్పటికీ దేశంలో స్టార్టప్‌లకు కేంద్రంగా నిలుస్తోంది. టెక్నాలజీ ఆవిష్కరణలు, వెంచర్ క్యాపిటల్ పెట్టుబడుఅధునాతన ఉద్యోగ అవకాశాలు ఇక్కడ విస్తృతంగా లభిస్తున్నాయి. బ్యాంకింగ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు అధికంగా ఉండటం, ఈ నగర ఆర్థిక స్థిరత్వాన్ని ప్రతిబింబిస్తోంది. మరోవైపు హైదరాబాద్ వేగంగా ఎదుగుతున్న టెక్ హబ్‌గా గుర్తింపు పొందుతోంది. ముఖ్యంగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల (+జజలు) స్థాపనలో ఈ నగరం కీలకంగా మారింది. ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ ఉద్యోగాలు పెరుగుతుండగా, మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

# ఆ చిత్రాల రికార్డును బద్దలుకొట్టిన 'ధురంధర్'



ధురంధర్-2 చిత్రం వసూళ్లలో దూసుకుపోతోంది. ఈ చిత్రం ఇప్పటి వరకు రూ.1,128 కోట్లు గ్రాస్ వసూళ్లు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. సినిమా విడుదలైన పదిరోజుల్లోనే ఈ స్థాయిలో కలెక్షన్లు వసూలు చేయడం గమనార్హం. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 18,456 షోలు పడ్డాయి. ధురందర్, ధురందర్-2 రెండు సినిమాలు కలిపి దంగల్, బాహుబలి, పుష్ప చిత్రాల జీవితకాల కలెక్షన్లను దాటాయి. ధురంధర్-2 తొమ్మిదో రోజు హిందీలో రూ.41.55 కోట్లు, తెలుగులో రూ.2.85 కోట్ల వసూళ్లు రాబట్టింది. అదే సమయంలో బాహుబలి-2, పుష్ప-2 చిత్రాలతో పోలిస్తే మాత్రం ధురంధర్-2 చాలా వెనుకబడి ఉంది. కానీ చిత్రం విడుదలై పది రోజులు మాత్రమే కావడంతో ఆ చిత్రాలను అధిగమించడానికి అవకాశాలు ఉన్నాయని సినీ పండితులు భావిస్తున్నారు.

బాహుబలి-2 రూ.1,810 కోట్లు, పుష్ప-2 రూ.1,800 కోట్ల వసూళ్లు రాబట్టాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు రాబట్టిన భారతీయ సినిమా దంగల్. ఈ చిత్రం రూ.2,024 కోట్ల వసూళ్ళు సాధించి రికార్డును అలాగే పదిలపరుచుకుంది. మిగిలిన అన్ని సినిమాలు టిక్కెట్ ధరలను పెంచి విడుదల కాగా, ధురంధర్ మాత్రం టిక్కెట్ ధరలు పెంచకుండానే వసూళ్లను సాధిస్తుండటం గమనార్హం.

# 'పెద్ది' కోసం 'లెనిన్' విడుదల వాయిదా

అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న 'లెనిన్' సినిమా విడుదల తేదీలో మార్పు జరిగింది. ముందుగా ప్రకటించిన ప్రకారం మే 1న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. కొత్త విడుదల తేదీని కూడా ప్రకటిస్తూ.. జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్లు అన్నపూర్ణ స్టూడియోస్ తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది.నమస్కారం, 'లెనిన్' చిత్ర బృందం తరపున ఈ ప్రకటన చేస్తున్నాం. ముందుగా ప్రకటించిన ప్రకారం మే 1న విడుదల కావాల్సిన మా 'లెనిన్' సినిమాను వాయిదా వేస్తున్నామని తెలియజేస్తున్నాం.మా ఈ నిర్ణయానికి ఒక ముఖ్యమైన కారణం ఉంది. మా ప్రియమైన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గారి 'పెద్ది' చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో, సినిమా రంగంలో ఒకరికొకరం గౌరవం ఇచ్చుకుంటూ, ఆరోగ్యకరమైన వాతావరణంలో సినిమాలను కలిసి సెలబ్రేట్ చేసుకోవాలని మేము నమ్ముతున్నాం. రామ్ చరణ్ గారికి, అఖిల్ గారికి మధ్య ఉన్న అనుబంధం గురించి అందరికీ తెలిసిందే. అఖిల్ గారికి చరణ్ గారు ఎప్పుడూ మంచి కోరే శ్రేయోభిలాషి. అందుకే, ఎంతో గౌరవంతో మేము ఈ నిర్ణయం తీసుకున్నాం.

ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించాలన్నదే మా లక్ష్యం. 'లెనిన్' చిత్రం అన్ని రకాల భావోద్వేగాలతో నిండిన ఒక పర్ఫెక్ట్ సినిమా వేడుకగా ఉంటుందని మీకు హామీ ఇస్తున్నాం. మా బృందం అత్యుత్తమ పనితీరుతో ఈ చిత్రాన్ని మీ ముందుకు తీసుకువస్తుంది.

అందుకే, 'లెనిన్' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 2026 జూన్ 26న విడుదల చేయాలని నిర్ణయించాం. మీరు మాపై చూపిస్తున్న ప్రేమకు, అందిస్తున్న మద్దతుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.ధన్యవాదాలతో,- టీమ్ లెనిన్ ... అంటూ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మురళి కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. అన్ని రకాల భావోద్వేగాలతో కూడిన ఒక సంపూర్ణ సినిమాటిక్ అనుభూతిని 'లెనిన్' అందిస్తుందని, అత్యుత్తమ రూపంలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్రబృందం హామీ ఇచ్చింది. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.





# ప్రచారం కూడా ఇష్టం లేదా?

బుట్టబొమ్మ పూజా హెగ్డే కెరీర్ విషయంలో కీలకమైన నిర్ణయాలు తీసుకుంటోంది. ఒకప్పుడు టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా వెలిగిన భామ వరుసగా స్టార్ హీరోల సరసన నటించి టాప్ పొజిషన్‌కు చేరుకుంది. అయితే తెలుగు సినిమాలను కాదని బాలీవుడ్ వైపు దృష్టి సారించడం ఆమె కెరీర్‌కు కొంత ప్రతిబంధకంగా మారింది. అక్కడ ఆశించిన స్థాయిలో సక్సెస్ లభించకపోవడంతో మళ్ళీ ఇప్పుడు టాలీవుడ్‌లో పాగా వేయడానికి కొంత కాలంగా గట్టి ప్రయత్నాలే చేస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం పూజా హెగ్డేకు తమిళంలో వరుస అవకాశాలు వస్తున్నప్పటికీ తెలుగులో మాత్రం అవకాశాలు రావడం లేదు.ఈ క్రమంలోనే విక్టరీ వెంకటేష్ - త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న -ఆదర్శ కుటుంబం - హౌస్ నెంబర్ 47- చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ చేసే అవకాశం తలుపు తట్టిందని తెలిసింది. కానీ ఈ ఛాన్స్ ను అమ్మడు సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. సాధారణంగా అవకాశాలు తక్కువగా ఉన్న సమయంలో ఏ చిన్న ఛాన్స్ వచ్చినా ఇండస్ట్రీలో నిలబడాలని భావిస్తారు. కానీ పూజ మాత్రం ఈ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించడం చర్చనీ యంశంగా మారింది. కనీసం ఐటం పాట అనే ప్రచారం కూడా నెట్టింట రావడం తనకు ఎంత మాత్రం ఇష్టం లేనట్లు వ్యవహరిస్తోందిట కేవలం ఒక పాటకే పరిమితం కావడం తన ఇమేజ్‌కు సరిపడదని పూజ భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో అమ్మడు నటించిన -జిగిల్ రాణి- సాంగ్స్ పెద్ద హిట్ అయినప్పటికీ? సెకండ్ ఇన్నింగ్స్‌లో కేవలం హీరోయిన్‌గానే సత్తా చాటాలని పట్టుదలతో కనిపిస్తోంది.

# డెకాయిట్ 'చిచ్చుబుడ్డి'..

## మాస్ స్టెప్పులతో అదరగొట్టిన శేష్..

వరుస హిట్లతో మంచి ఫామ్ లో ఉన్న యంగ్ హీరో అడివి శేష్.. తన సినిమాల ఎంపికలో ఎప్పుడూ వైవిధ్యాన్ని చూపిస్తుంటారు. ఇప్పటివరకు క్లాస్, ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథలతో ప్రేక్షకులను మెప్పించిన ఆయన.. ఇప్పుడు మాస్ ట్రాక్ లోకి అడుగుపెట్టారు. ఆయన నటిస్తున్న తాజా యాక్షన్ రొమాంటిక్ థ్రిల్లర్ డెకాయిట్ నుంచి విడుదలైన రెండో పాట చిచ్చుబుడ్డి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆ పాటతో శేష్ తనలోని కొత్త కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. సాధారణంగా ఆయన సినిమాల్లో డ్యాన్స్ కంటే కథ, మైండ్ గేమ్స్ కే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. అయితే చిచ్చుబుడ్డి సాంగ్ లో మాత్రం హై-ఎనర్జీ మాస్ స్టెప్పులతో ఫ్యాన్స్ ను అలరించారు. రగ్గడ్ లుక్ లో కనిపిస్తూనే గ్రేస్ ఫుల్ డ్యాన్స్ తో అదరగొట్టడం విశేషం. పాటలో శేష్ చూపించిన ఉత్సాహం, స్టైల్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఆ సాంగ్ కు సంగీతం అందించిన భీమ్స్ సిసిరోలియో, ఫోక్ బీట్ తో కూడిన మాస్ నంబర్ గా కంపోజ్ చేశారు. ఆయన అందించిన బీట్స్ సాంగ్ కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక సాహిత్యాన్ని అందించిన భాస్కరభట్ల రవికుమార్ తనదైన స్టైల్లో సరదాగా, క్యాచీగా ఉండే పదాలతో పాటకు ఎనర్జీని పెంచారు. రామ్ మిరియాల, జోనితా గాంధీ తమ వాయిస్ తో సాంగ్ కు కొత్త ఊపు తీసుకొచ్చారు. ముఖ్యంగా జోనితా గాంధీ ఆ పాటను పాడటమే కాకుండా తెరపై గ్లామరస్ డ్యాన్స్ తో కూడా మెరిశారు. భోజ్ పురి స్టార్ పవన్ సింగ్ ప్రత్యేకంగా కనిపించడం పాటకు మాస్ అప్పీల్ ను మరింత పెంచింది. భారీ సెట్స్ మధ్య, పెద్ద సంఖ్యలో ఆర్టిస్టులతో పాటను ఎంతో రిచ్ గా చిత్రీకరించారు. ప్రతి ఫ్రేమ్ ఒక వేడుకలా కనిపిస్తూ, ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ గా నిలుస్తోంది. కొరియోగ్రఫీ మాస్ ఆడియన్స్ ను దృష్టిలో పెట్టుకుని రూపొందించినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ రూబరూలో శేష్ పాత్రలోని ఎమోషనల్ యాంగిల్ చూపించగా, చిచ్చుబుడ్డి.. మాత్రం పూర్తిగా విభిన్నమైన మూడ్ ను తీసుకొచ్చింది.




# మాస్ వయొలెన్స్‌లో ప్యూర్ లవ్ స్టోరీ..

# అనకాపల్లి టీజర్

విక్రమ్ సాహిదేవ్ హీరోగా పరిచయమవుతున్న 'అనకాపల్లి' సినిమా టీజర్ తోనే హాట్ టాపిక్ గా మారింది. సినిమా చూపిస్త మావ, నేను లోకల్, ధమాకా వంటి బిగ్ హిట్స్ అందుకున్న సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ త్రినాధరావు నక్కిన స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటంతో సినిమాపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. టీజర్ చూస్తుంటే ఇది కేవలం ఒక మాస్ యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా, లోతైన ఎమోషన్స్ ఉన్న పక్కా లోకల్ స్టోరీ అని అర్థమవుతోంది.టీజర్ మొదలవ్వడమే హీరో పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో చాలా సీరియస్‌గా స్టార్ట్ అవుతుంది. అనకాపల్లిలో బతకాలంటే ఎదుటివాడికి మనమంటే భయం ఉండాలంటూ హీరో ఇచ్చే ఎంట్రీ మాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా ఉంది. అయితే ఆ వయొలెన్స్ వెంటనే ఒక అందమైన పల్లెటూరి ప్రేమకథగా మారిపోతుంది. అమాయకమైన చూపులతో, స్వచ్ఛమైన నవ్వుతో సాగే ఈ లవ్ స్టోరీ టీజర్‌కు ఒక కొత్త ఫీల్‌ను తీసుకొచ్చింది. విక్రమ్ సాహిదేవ్ తన మొదటి సినిమాతోనే నటుడిగా మంచి ఇంపాక్ట్ చూపించేలా ఉన్నాడు. ఒకవైపు మొండితనం చూపిస్తూనే, మరోవైపు లవ్ సీన్స్‌లో చాలా సాఫ్ట్‌గా కనిపిస్తూ వేరియేషన్స్ బాగానే మెయింటైన్ చేశాడు. హీరోయిన్ సంధ్యా వశిష్ట కూడా తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు మెయిన్ పిల్లర్‌గా నిలిచేలా కనిపిస్తోంది. ఇక సీనియర్ నటి ఇంద్రజ, త్రినాధరావు నక్కిన హీరో తల్లిదండ్రులుగా కీలక పాత్రల్లో కనిపించారు.

సాంకేతికంగా ఈ సినిమా చాలా రిచ్‌గా ఉంది. పల్లెటూరి వాతావరణాన్ని చాలా సహజంగా చూపిస్తే, డ్యావ్‌జాంద్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌లో ఉన్న టెన్షన్‌ను బాగా ఎలివేట్ చేసింది. దర్శకుడు ఖగేష్ తమ్మినేని మాస్ ఎలిమెంట్స్‌కు, ఫ్యామిలీ ఎమోషన్స్‌కు మధ్య సరైన బ్యాలెన్స్ కుదిర్చినట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది. కథలో ఏదో తెలియని ఏమోషన్ దాగి ఉందనే విషయాన్ని టీజర్‌లో ఎక్కడా రివీల్ చేయకుండా జాగ్రత్త పడ్డారు. ఫైనల్ గా 'అనకాపల్లి' టీజర్ ఈ సమ్మర్ బరిలో ఒక గట్టి సినిమా రాబోతుందనే నమ్మకాన్ని కలిగిస్తోంది. యాక్షన్ ప్రియులతో పాటు, ఎమోషనల్ లవ్ స్టోరీస్ ఇష్టపడే వారికి కూడా ఈ సినిమా నచ్చేలా ఉంది. ఏప్రిల్ 30న విడుదల కాబోతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.




# 'లీడర్'గా మరోసారి..

ప్రముఖ వస్త్రదుకాణం శరవణన్ స్టోర్స్ యజమాని లెజెండ్ శరవణన్.. నాలుగేళ్ల క్రితం తన పేరుతోనే తీసిన చిత్రం 'లెజెండ్'. ఈ సినిమా ప్రమోషన్ల సమయంలోనే ఘోరంగా ట్రోలింగ్‌కి గురైంది. ఇక



థియేటర్లలో వచ్చిన తర్వాత సినిమాపై విమర్శలు మరింత పెరిగాయి. అయితే ఇప్పుడు నాలుగేళ్ల తర్వాత శరవణనన్ మరోసారి హీరోగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ సారి ఆయన 'లీడర్' అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించనున్నారు. ఈ మూవీకి ఆర్ఎస్ దురై సెంథిల్ కుమార్ దర్శకత్వం వహించగా.. పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్‌గా నటించింది. ఆండ్రియా, శ్యామ్, లాల్ లాంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. జిబ్రాన్ ఈ సినిమాకు సంగీతం అందించాడు. ఏప్రిల్ 3వ తేదీన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కానుంది. ఆదివారం ఈ సినిమా ఆడియో ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా యాక్షన్ ట్రైలర్‌ని విడుదల చేశారు. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఈ ట్రైలర్‌లో భారీ తనం కనిపిస్తుంది. మరి ఈ మూవీ అయినా శరవణన్‌కి సక్సెస్ ఇస్తుందో.. లేదో చూడాలి..

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613